పద్మశాలీలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

పద్మశాలిలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని పద్మశాలిల సంఘం అధ్యక్షులు జిల్లా రాంబాబు, ప్రధాన కార్యదర్శి రామా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నియమించబోయే కార్పొరేషన్ నామినేటెడ్ పోస్టులలో పద్మశాలిలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పద్మశాలీలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, సొంత స్థలం ఉన్న వారికి ఐదు లక్షలు కేటాయించాలని కోరారు పద్మశాలిల సమస్యల పరిష్కారం కోసం వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉండి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ కన్వీనర్ భావండ్ల పాండు, ఆ సంఘం నాయకులు ముసా కృష్ణమూర్తి, పిల్లలమర్రి రమేష్, జిల్లా ప్రభాకర్ రావు, లక్ష్మీనారాయణ, నాగేందర్, నర్సింహ ప్రసాద్, కుమారస్వామి, ఈశ్వరయ్య, పిల్లల మర్రి ప్రసాద్, మల్లయ్య, గంజి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ

సోమవారం సెప్టెంబర్ 09. 2024 www.navatelangana.com

రామకృష్ణ పోరాటపటిమ ఆదర్శప్రాయం

నవతెలంగాణ-చిట్యాల



విద్యుత్ పోరాట అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ పోరాట పటిమను నేటి యువతకు ఆదర్శప్రాయమని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో ఆదివారం రామక్రిష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ విద్యుత్ పోరాట సమయంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన రామకృష్ణ మరణం పాలక పక్షాలకు కనువిప్పు అని అన్నారు.విద్యుత్ పోరాటం వల్ల ప్రజల పై భారం పడకుండా అయ్యిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహ, ఐతరాజు యాదయ్య, సిపిఎం నాయకులు జిట్ట స్వామి, వివిధ ప్రజా సంఘాల నాయకులు బొడ్డు బాబురావు, మేడి యాదయ్య, బద్దుల రమేష్, దూడల యాదయ్య, నలపరాజు సైదులు, డేవిడ్, గోపాలు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలి

- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- పలు మండపాల సందర్శన

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



ప్రజలంతా గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మతసామరస్యానికి ప్రత్యేకగా నిలిచిన నల్లగొండ జిల్లాలో ఈ సంవత్సరం గతంలో కంటే గొప్పగా వినాయక ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఆదివారం నల్లగొండకు వచ్చిన మంత్రి మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డితో కలిసి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన వివిధ వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏడు సంవత్సరాల తర్వాత నల్లగొండ జిల్లా కేంద్రంలో వివిధ వినాయక మండపాల వద్ద పూజలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ గణనాథుని కోరుకున్నట్లు తెలిపారు.గణేష్ నవరాత్రి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, శాంతి యుతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్, రెవిన్యూ, మున్సిపాలిటీ, ట్రాన్స్ కో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్డీవో రవి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు కేసాని వేణుగోపాల్ రెడ్డి, మారగోని నవీన్ గౌడ్, ఇబ్రహీం,జానయ్య, జూలకంటి శ్రీనివాస్, గణేష్, శ్రీనివాస్, గణేష్ ఉత్సవ సమితి నాయకులు కర్నాటి విజయకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మందడి శ్రీనివాసరెడ్డి, అల్లి సుభాష్ యాదవ్, నంద్యాల వీర బ్రహ్మానంద రెడ్డి, వంగాల అనిల్ రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, నాంపల్లి నరసింహ, దుబ్బ అశోక్ సుందర్, వెంకన్న, గాలి నాగరాజు, మామిడి కార్తీక్, పాదం అనిల్ పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాలకు దారి చూపే మహాసభలను జయప్రదం చేయండి

- మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ



కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి రెండేండ్ల నుండి నిర్వహించిన ప్రజా ఉద్యమాలను నివృత్తి చేసుకొని భవిష్యత్ పోరాటాలు నిర్మించడానికి సీపీఐ(ఎం) శాఖా మహాసభలు నిర్వహిస్తుందని, అటువంటి మహాసభలను జయప్రదానికి పార్టీ శ్రేణులు సిద్ధమై కమ్యూనిస్టు ఉద్యమాల పట్ల ప్రజలకు విశ్వాసం కలిగించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం మండలంలోని చిల్లాపురం గ్రామంలో ఆ పార్టీ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాద ఫాసిస్టుశక్తులు అధికారాన్ని చేజిక్కించుకొని కులాల మధ్య, మతాల మధ్య ఘర్షణ చెలరేగాలని చూస్తున్న ఈ సమయంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలు అవసరం అన్నారు. కమ్యూనిస్టు పోరాటాలు బలపడి జనాలలో లౌకికశక్తి పట్ల విశ్వాసాన్ని కలిగించాలన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వంపై ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉన్నదని ఆ విశ్వాసం నిలబెట్టుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలనుఅమలు చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రజా క్షేత్రంలో వారిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ(ఎం) చిల్లాపురం శాఖ నూతన కార్యదర్శిగా కోట్ల శ్రీనివాసరెడ్డి సహాయ కార్యదర్శిగా బద్దెపాక ఆశీర్వాదాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రవినాయక్, జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి, పగిడోజు రామ్మూర్తి, నాయకులు నంద్యాల వేణుధర్‌రెడ్డి, పోలేపల్లి గోవిందరెడ్డి, జాను,గోపి తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- మహేష్ గౌడ్ నియామకం పట్ల హర్షం
- ఎమ్మెల్యే బీఎల్ఆర్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నవతెలంగాణ-మిర్యాలగూడ



బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్ అన్నారు.టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్‌ను నియమించడం పట్ల హర్షిస్తూ శనివారం రాజీవ్ భవన్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే కాంగ్రెస్‌లో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు.పార్టీ కోసం పనిచేసిన నాయకులకు పార్టీ తప్పనిసరిగా గుర్తిస్తుందని చెప్పారు.బడుగు. బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకొస్తుందన్నారు.కాంగ్రెస్‌బీసీ సెల్ రాష్ట్ర నాయకులు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ డిలీగేట్ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పతఊడిమర్రి నర్సింహారావు, కిసాన్ కాంగ్రెస్ జి ల్లా అ ధ్యక్షులు ము దిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల , పొదిల శ్రీనివాస్, తమ్ముడబోయిన అర్జున్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆవుల బక్క రెడ్డి,వేములపల్లి, దామచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలికాంతరెడ్డి గాజుల శ్రీనివాస్ జిల్లా నాయకులు రావు ఎల్లారెడ్డి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ గంధం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు చౌగాని వెంకన్నగౌడ్, బి.సతీష్‌రెడ్డి, పల్లావెంకటయ్యక, బంటు రమేశ్, నామ అజయ్ పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర సమగ్ర చట్టం తేవాలి



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-మునుగోడు

రైతుల పండించిన పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించడంతోపాటు, పార్లమెంటులో సమగ్ర చట్టం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో కామ్రేడ్ పగిళ్ల చిన్న నరసింహ నగర్‌లో జరిగిన సీపీఐ(ఎం) 17వ గ్రామశాఖ మహాసభకు హాజరై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక రైతుల పట్ల వివక్ష చూపుతుందని అన్నారు. రెండు సంవత్సరాల నుంచి దేశం నడిబొడ్డున రైతులు ఉద్యమాలు చేస్తున్నప్పటికీ, రైతుల మీద అక్రమ కేసులు పెట్టడం తప్ప రైతుల యొక్క సమస్యలు పరిశీలించడంలో మోడీ విఫలమయ్యారని అన్నారు. కేంద్ర బడ్జెట్లో రైతాంగానికి తగిన బడ్జెట్ కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని, ప్రజలకు ఇచ్చిన ఆరు గారంటీలను అమలు చేయాలని, పూర్తిస్థాయిలో రెండు లక్షల రుణమాఫీని చేయాలని, రైతుల ఖాతాల్లో వెంటనే రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం గారు హాజరై మాట్లాడుతూ డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ను ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కల్వకుంట్ల గ్రామానికి సౌకర్యవంతమైన రోడ్డు ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేక ఆ గ్రామ ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రయాణించాల్సిన పరిస్థితి దాపరించిందని మండిపడ్డారు.కల్వకుంట్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, కల్వకుంట్ల నుంచి వెల్మ కన్నె వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మిర్యాల భరత్ , సహాయక కార్యదర్శి వరుకుప్పల ముత్యాలు , గ్రామ శాఖ నాయకులు నారబోయిన నరసింహ ,పగిళ్ల మధు, బొందు చిన్న నరసింహ ,బొందు అంజయ్య, అయితగోని యాదయ్య, పగిళ్ల యాదయ్య, కట్ట మారయ్య, పుల్కారం అంజయ్య, జిల్లపల్లి యాదయ్య, పగిళ్ల వెంకన్న, కట్ట ఆంజనేయులు, బొందు సుందరయ్య, చేకూరి బిక్షం, కుక్కల బాలస్వామి, సింగపంగా లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నష్టం అంచనాలను జాగ్రత్తగా రూపొందించాలి

- ఫొటోలు, ఆధారాలు, ఇతర ధృవపత్రాలతో సహా అందించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



గత నెల చివరి వారంలో, ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం అంచనాలను పూర్తి జాగ్రత్తగా రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ మరియు సహాయ, శాశ్వత పునర్నిర్మాణ పనుల జిల్లా నోడల్ అధికారి, ఐఏఎస్ అధికారి అనితా రామచంద్రన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా జరిగిన వివిధ రకాల నష్టం అంచనాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత నెల 30, 31 తో పాటు, ఈ నెల ఒకటి, రెండు, మూడో తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు రావడం జరిగిందని, దీనివల్ల ప్రాణ, ఆస్తి నష్టం వంటివి జరిగాయని, వీటన్నిటిపై రాష్ట్ర ప్రభుత్వం నష్టం అంచనాలు తయారు చేసేందుకు అన్ని జిల్లాల ఆదేశించినట్లు ఆమె తెలిపారు. భారీ వర్షాల ప్రభావిత జిల్లాలలో నల్గొండ సైతం ఉందని, ఇందులో భాగంగా భారీ వర్షాల వల్ల నల్గొండ జిల్లాలో ఎక్కడైనా మనుషులు, పశువులు చనిపోవడం, అలాగే పక్కాఇండ్లు,కచ్చా ఇండ్లు పూర్తిగా కూలిపోవడం, పాక్షికంగా దెబ్బతినడం, గుడిసెలు వర్షానికి కొట్టుకుపోవడం జరిగినట్లయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంచనాలను తయారు చేసి వెంటనే సమర్పించాలని ఆమె ఆదేశించారు. ఫోటోలు,ఆధారాలు, ఇతర ధృవపత్రాలతో సహా నష్టం అంచనా వివరాలు సమర్పించాలని అన్నారు. సమావేశం ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు ,వరదల వల్ల ఆయా సెక్టార్ల వారిగా జరిగిన నష్టాన్ని అంకెలు,ఫొటోలతో సహా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆమె యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన నష్టాన్ని ఆ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్ సలోన్ లతో సమీక్షించారు.అనంతరం నోడల్ అధికారి, జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లు కేతేపల్లి మండలం,కేతేపల్లి నుండి కాసనగొడు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు పరిశీలించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయన్,నల్గొండ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో రవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రమణ్యం తో పాటు వ్యవసాయ, మత్స్య, విద్యుత్, విద్య, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇరిగేషన్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

గత పది రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు వేసిన పంటలు పూర్తిగా నష్టం జరిగిందని వెంటనే ప్రభుత్వం స్పందించి వెంటనే వ్యవసాయ అధికారులను గ్రామాలలో పర్యటించి వర్షాలకు నష్టపోయిన పంటను అంచనా వేసి రైతులను పత్తి పంటకు ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం అందించాలని మాజీ వైస్ ఎంపీపీ కల్లూరు యాదగిరి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెంలో సీపీఐ(ఎం) శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇంత నష్టం జరుగుతున్నా ఇప్పటివరకు రైతు భరోసా ప్రకటించలేదని, వెంటనే ప్రభుత్వం స్పందించి రైతు ఖాతాలో రైతు భరోసా జమచేయాలని కోరారు. అంతేకాకుండా వర్షాల వల్ల వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలో భాగంగా వ్యవసాయ కూలీలకు 15వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారని చెప్పారు. కూలీలు ఇంత ఇబ్బంది పడుతున్న ఇప్పటికీ కూడా ప్రకటించకపోవడం చాలా విడ్డురంగా ఉందని అన్నారు. వర్షాలుపడి రోడ్లు మొత్తం గుంటల మయంగా మారాయని వెంటనే వాటిని మరమతులు చేయించలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు దండు రవి,శాఖ కార్యదర్శి దండు నాగరాజు, దండు శంకర్, బొల్లెద్దు సైదులు, ఇంతటి సత్యనారాయణ, మాడగొని సైదులు, దండు శ్రీను, పోకల వెంకయ్య శంకరయ్య, బొడ్డుపల్లి భాష పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో అవసరం



నవతెలంగాణ-నకిరేకల్

జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో అవసరం అని దైద సుందరయ్య ఫౌండేషన్ చైర్మన్ దైద రవీందర్ పేర్కొన్నారు. జర్నలిస్టుల దినోత్సవం పురస్కరించుకొని ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పత్రిక విలేకరులు జి.రాములు, రాంబాబు, కందగట్ల శ్రీధర్, రేపాల సతీష్, రమేష్ , రామ సాయిలు, శాంతి కుమార్ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న వాస్తవ సంఘటనలను ప్రజా మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేస్తూ, ప్రజాసేవ కోసం, ప్రజల అవసరాలను పాలకులకు తెలియజేస్తూ ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కలాన్ని ఆయుధంగా చేసుకొని పనిచేసేవారే జర్నలిస్టులు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గణేషుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెంలో వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టాపన చేసిన మట్టి గణపతి విగ్రహం వద్ద స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. సకలవిఘ్నాలు తొలిగించే ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి కరుణకటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో గడపాలన్నారు. నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని వినాయకుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

రహదారి ఉంది.. ఎటు పోతుందో తెలియదు..!

- చందంపల్లి ఫ్లై ఓవర్ బిడ్జి వద్ద లేని సూచికలు
- పగలు అంతంత మాత్రమే.. రాత్రిపూట ఇబ్బందులే

నవతెలంగాణ-నకిరేకల్



తానంచర్ల నుండి శిరోంచ వరకు వెళ్లే 365వ జాతీయ రహదారి చందంపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సూచికలు, వీధి దీపాలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. రహదారి నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులు నకిరేకల్ మీదుగా అర్వపల్లి, మరిపెడ బంగ్లా, మహబూబాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు నకరేకల్ మండలంలోని చందంపల్లి స్టేజి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు విజయవాడ నుండి హైదరాబాదు వైపు వెళ్లే వాహనదారులు పట్టణ శివారులోని హరికృష్ణ పార్ బాయిల్డ్ మోడ్రన్ రైస్ మిల్ సమీపము నుండి ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ఎక్కేందుకు రోడ్డును నిర్మాణం చేశారు. కానీ ఈ రోడ్డు ఎటువైపు వెళుతుందఅన్న సూచికలు మాత్రం ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో ఉన్న రోడ్డు కాస్త కనపడకపోవడంతో వాహనదారులు అయిటిపాముల వరకు వెళ్లి తిరిగి ఫ్లైఓవర్ మీదుగా తమ తమ ప్రాంతాలకు వెళుతున్న పరిస్థితి ఉంది. మూడేళ్ల నుండి ఇదే పరిస్థితి పురాణావృతమవుతున్న అధికారులు మాత్రం సూచిక బోర్డులు, హైమాస్ట్ వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా హైదరాబాదు నుండి సూర్యాపేట వైపు వెళ్లే వాహనదారులు మహబూబాబాద్ కు చందంపల్లి సర్వీస్ రోడ్డు నుండి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కి వెళ్లవచ్చు కానీ ఇక్కడ సూచిక బోర్డు మాత్రం చందంపల్లి గ్రామ స్టేజ్ వద్ద ఏర్పాటు చేశారు. ఈ బోర్డు చెట్ల కొమ్మలతో కనబడకుండా ఉంది. దీంతో వాహనదారులు చందంపల్లి గ్రామంలోకి వెళ్లి ఆ రహదారి కాదని తెలుసుకొని తిరిగి వెనక్కి వస్తున్న పరిస్థితి ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి సూచిక బోర్డులు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు: పులిగిల్ల అభిరాం (నకిరేకల్)



నకిరేకల్ నుండి మహబూబాబాద్ వైపు వెళ్లే వాహనదారులకు సూచిక బోర్డులు, హైమాస్ట్ లైట్లు చందంపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కే ప్రారంభంలో ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ సూచిక బోర్డులు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయలేదు. నకిరేకల్ నుండి మార్కెట్ రోడ్డు గుండా కడపర్తి వెళ్లే ప్రయాణికులకు జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్ వెలగక ఇబ్బందులు పడుతున్నారు.

గుండెపోటుతో లారీ క్లీనర్ మృతి !



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

లారీలో నిద్రిస్తూ గుండెపోటుతో లారీ క్లీనర్ క్యాబి న్‌లోనే మృతిచెంది. ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ ంలోని లారీ అసోసియేషన్ ఆఫీస్ పక్కన గల శ్రీ సాయి ఫిల్లింగ్ స్టేషన్ నందు టి ఎస్ 05 యూ డి 3469 నెంబర్ గల లారీ క్యాబిన్‌లో రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ఖమ్మంపాటి లింగయ్య లారీ క్లీనర్ వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. లింగయ్య లారీ యొక్క క్యాబిన్లోనే గుండెపోటుతో చనిపోయినట్లు తెలిపారు. మృతునీ భార్య కంభంపాటి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై డి.క్రాంతి కుమార్ తెలిపారు.



ఆందోళన వద్దు .. అప్రమత్తతే మందు

- వైరల్ జ్వరం వచ్చినా ప్లేట్లేట్స్ తగ్గుదల
- జాగ్రత్తలు పాటిస్తే త్వరగానే ఆరోగ్యం
- జిల్లాలో నేటికీ 341 డెంగ్యూ, 12,372 వైరల్ కేసుల నమోదు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లావ్యాప్తంగా వైరల్ జ్వరాల కారణంగా రోగుల్లో రక్తఫలకికలు తగ్గుతున్నాయి. డెంగీగా భావించి చాలా మంది ఆందోళన చెందుతున్నారు. తెల్లరక్తకణాలు (ప్లేట్లెట్స్) సంఖ్య తక్కువైన వేళ తీవ్రంగా ఆలోచించి సమస్యను జఠిలం చేసుకుంటున్నారు. సకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

శరీరానికి ఎంతో దోహదం

రక్తఫలకికల్లో ఒక్కటైన తెల్లరక్తకణాలు(ప్లేట్ లెట్స్) వ్యాధి నిరోధకాలుగా పని చేస్తూ శరీరం రోగాలమయం కాకుండా కాపాడుతుంటాయి. ఎర్ర రక్తకణాల్లో ఉండే హిమోగ్లోబిన్ ద్వారా శరీరం మొత్తానికి అవసరమైన ప్రాణవాయువు అందుతుంది. రక్తఫలకికల్లో కొన్ని శరీరానికి గాయం అయినప్పుడు రక్తం గడ్డకట్టడానికి తోడ్పడుతాయి. ఇలా రక్తఫలకికలు నిత్యం తమ పాత్రను సక్రమంగా పోషిస్తుండడంతో ఆరోగ్యంగా జీవించగలుగుతాం.

1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు

రక్తఫలకికలు కేవలం 10 రోజులు మాత్రమే శరీరంలో జీవిస్తాయి. ఎముక మజ్జ ప్రతి రోజూ మిలియన్ల ఫలకికలను ఉత్పత్తి చేస్తుంది. ఒక మైక్రోలీటర్ రక్తంలో సాధారణంగా 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ఫలకికలు ఉంటాయి. మహిళలలో ఈ సంఖ్య1.57 లక్షల నుంచి 3.71 లక్షల వరకు ఉంటుందని నిర్ధారించారు.

40 వేలకు దిగువన అయితే రక్తస్రావమే

రక్తంలో ఫలకికల సంఖ్య 40 వేలకు దిగువన ఉంటే.. రక్తనాళాల్లో రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది. ఒక మైక్రోలీటర్ రక్తంలో సాధారణంగా 20 వేల కన్నా ఫలకికలు తక్కువగా ఉంటే తీవ్రమైన థ్రోంబోసైటోపెనియా వస్తుంది. అంతర్గతంగా ఇది తీవ్ర రక్తస్రావాలకు దారి తీస్తుంది. ప్రాణాలకు ప్రమాదం కలిగే ఆస్కారం ఉంది.

2 రోజుల్లో పెంచుకోవచ్చు

ఒక వ్యక్తి 2 రోజుల్లో వారి రక్తఫలకికలను పెంచుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తినాలి. మొత్తం శరీరానికి ఫోలేట్ లేదా విటమిన్ బీ12 అధికంగా ఉండే ఆహారాన్ని తినడం ద్వారా సహజంగా ఫలకికలు పెరుగుతాయి. దీనికి తోడు బొప్పాయి, కొబ్బరి నీళు అధికంగా తీసుకోవాలి. దానిమ్మ, ఎండు ద్రాక్ష, కివీ పళ్లను ఎక్కువగా స్వీకరించాలి. అన్ని జ్వరాలను డెంగీగా పరిగ ణించలేమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వైరల్ ఫీవర్ కారణంగా కూడా రక్త పలికికల్లో తేడా వస్తుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మళ్లీ మూడు రోజుల్లో రక్తంలో ఫలకి కలు వృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

నల్లగొండ జిల్లాలో కేసులు..

వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లాలో గత జనవరి నుండి నేటి వరకు నమోదైన కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. డెంగ్యూ కేసులు జనవరిలో 11, ఫిబ్రవరిలో 19, మార్చిలో 20, ఏప్రిల్ లో 10, మేలో 8, జూన్ లో 17, జూలైలో 67, ఆగస్టులో 186, సెప్టెంబర్ లో 3, మొత్తం 341 కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా చికెన్ గున్యాకు సంబంధించి మార్చిలో రెండు మేలో రెండు జూలైలో 3 ఆగస్టులో 1 మొత్తం 8 కేసులు నమోదయ్యాయి. మలేరియా విషయానికొచ్చేసరికి గత జూలై నెలలో ఒకే ఒక్క కేసు నమోదు అయింది. వైరల్ ఫీవర్లకు సంబంధించి మొత్తం 12,372 కేసులు నేటి వరకు నమోదయ్యాయి. జనవరిలో 1554, ఫిబ్రవరిలో 14 32, మార్చిలో 14 64, ఏప్రిల్ లో 1340, మేలో 1332, జూన్ లో 1246, జూలైలో 1393, ఆగస్టులో 2264, సెప్టెంబర్ లో 346 కేసులు నమోదయ్యాయి.

ప్రయివేటును ఆశ్రయిస్తున రోగులు..

వివిధ వ్యాధుల బారిన పడిన రోగులు ప్రభుత్వాసుపత్రిని కాకుండా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండని వైద్యులు, దొరకని మందులతో ప్రాణాల మీదకు తెచ్చుకునేది ఎందుకని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. కాగా ఈనెల 1వ తేదీ నుండి నేటి వరకు నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 10 డెంగ్యూ, 87 వైరల్ జ్వరాల బారిన పడిన బాధితులు చికిత్స పొందుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

మానవత్వం ప్రదర్శించిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్

నవతెలంగాణ-నకిరేకల్

ఖమ్మంలో కురిసిన అకాల వర్షాలకు ఎంతో మంది నివాసాన్ని కోల్పోయి ఆకలి బాధతో అలమటిస్తుండడం పట్ల చలించి నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం ఖమ్మం రాజీవ్ గృహ కాలనీలో ఉన్న ఇండ్లు నీట మునిగి భోజనం కోసం ఇబ్బంది పడుతున్న 500 మందికి భోజనం, చీరలు, పిల్లలకు బిస్కెట్స్ అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి

నవతెలంగాణ-కేతెపల్లి

కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో వినాయక చవితి పర్వదినాన్ని శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాలలో వాడవాడల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాలలో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కోలాటాలు భజన భక్తి పాటలతో గణనాథాలను మంటపంలోకి ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు మొక్కులు చెల్లించుకున్నారు.ఆయా కార్యక్రమాలలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

దేవేందర్‌కు పాన్ ఇండియా ఐకాన్ అవార్డు ప్రదానం



నవతెలంగాణ-చివ్వెంల

మండలంలోని బద్యాతండకు చెందిన బానోత్ దేవేందర్ కు ఆదివారం పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు ప్రదానం చేశారు. సూర్యాపేట లోని మంటెస్సోరి, నవోదయ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న బానోత్ దేవేందర్ కు గుంటూరులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు చేతుల మీదిగా అవార్డు ప్రదానం చేశారు. దేవేందర్ అవార్డు పొందడం పట్ల పలువురు అధ్యాపకులు, తండా వాసులు అభినందనలు తెలిపారు.

ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం అందించాలి

నవతెలంగాణ-మఠంపల్లి



ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలకు ఎకరానికి 20 వే లు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు భూక్యా పాండు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేఖులతో మాట్లాడుతూ రెండు లక్షలకు పైబడిన రుణాలకు వెంటనే మాఫీ చేయాలని ప్రభుత్వానికి కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మాలోతు బాలు నాయక్, జగన్ మోహన్ రెడ్డి,మండల కమిటీ సభ్యులు, శంబయ,కే వెంకట్ రెడ్డి,పాడిచెట్టి రాము, కంటుకోటయ్య, దాట్ల వీర బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

నవతెలంగాణ-మునగాల



నీట మునిగిన వరి పంటలకు నష్టం పరిహారం అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గణపవరం వాగు వెంట మునిగి పోయిన వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. అల్పపీడ నం ప్రభావంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు.దీంతో చెరువులు కుంటలు నిండి వాగులు వంకలు ఉధృతం ప్రవహించి వరి పంటలను నీట ముంచాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోతె మండలం నామవరం నుంచి మఠంపల్లి మండలం యాతవాకిళ్ళ వరకు సుమారు రెండువేల ఎకరాల వరకు వరి పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. రెండు నియోజక వర్గాల పరిధిలో ఆరు మండలాలకు చెందిన వందలాది మంది రైతులు ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి దాపురించిందన్నారు. సుమారు మూడు వందల మీటర్ల వెడల్పులో వాగు 60 కిలో మీటర్ల వరకు ప్రవహించటం తో రైతాంగం బావురుమంటున్నారని చెప్పారు. సాగు చేసిన పంటలు మొత్తం నీటిలో మునగటంతో వరి కుదుళ్లుకూడా కుళ్ళి పోయా యని ఆవేదన వ్యక్తంచేశారు.వరి పంటలుతో పాటు వాగు వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు కూడా నీటిలో కొట్టుకు పోయాయని తెలిపారు. వాగులు ఉధృతంగా ప్రవహించటంతో పొలాలు ఇసుక మేటలు వేశాయని చెప్పారు. మేటలు వేసిన భూములు భవిష్యత్తులో పంటల సాగుకు పనికి రావని గుర్తు చేశారు.ఇసుక మేటలు వేసి నష్ట పోయిన రైతులకు ఎకరానికి 50 వేలు. నీట మునిగిన వరి పంటల కు 20వేల చొప్పున పరిహారం చె ల్లించాలని డిమాండ్ చేశారు.జరి గిన నష్టాన్ని తూ తూ మంత్రంగా అంచనా వేయకుండా క్షేత్ర స్థాయి లో అధికారులు నష్టాన్ని గుర్తించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కా ర్యదర్శి వర్గ సభ్యులు మేదరమె ట్ల వెంకటేశ్వర రావు,కొలిశెట్టి యా దగిరిరావు, సిపిఐ(ఎం)జిల్లా కమి టీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, మండల కార్యదర్శి చందా చంద్ర య్య, నాయకులు ఆరె రామ కృ ష్ణా రెడ్డి, స్టాలిన్ రెడ్డి,సుంకర పిచ్చ య్య,జూలకంటి కొండారెడ్డి,జూల కంటి విజయలక్ష్మి, ఎస్ కె సైదా, స్వరాజ్యం, వీర బోయిన వెంకన్న, బోళ్ళ కృష్ణా రెడ్డి, సతీష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం కోసం కొనసాగుతున్న గాలింపు



- రెండు నెలల కింద అదే క్వారీ గుంతలో ఈతకు వెళ్లి ముగ్గురు మృతి

నవతెలంగాణ-ఆత్మకూర్(ఎస్)

మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో క్వారీ గుంతలో వ్యవసాయ విద్యుత్ మోటర్ తీసేందుకు నీటిలోకి దిగి ప్రమాదవశాత్తు శనివారం మునిగిపోయిన వ్యక్తి కోసం పోలీసులు గజ ఈతగాళ్లు ఫైర్ సిబ్బంది గాలింపు కొనసాగుతోంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం కూడలి తండాకు చెందిన బుక్య బిచ్యా బొప్పారంలో భూమి కౌలుకు తీసుకొని క్వారీ గుంట నుండి వ్యవసాయ మోటారుతో నీళ్ళు పంట పొలానికి వాడుకునేవాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు క్వారీ గుంతలో భారీగా నీరు చేరడంతో వ్యవసాయం మోటారు నీటిలో మునిగింది. మునిగిన విద్యుత్ మోటార్‌ను బయటికి తీసేందుకు అదే తండాకు చెందిన బానోతు హీరా(60)ను బిచ్య కూలీకి తీసుకొచ్చాడు. క్వారీ గుంతలో ఉన్న మోటర్ తీసేందుకు నీళ్లలోకి వెళ్లిన హీరా మోటార్కు తాడుకట్టి బయటికి రాలేదు. బయట ఉన్నవారు తాడు సహాయంతో మోటర్ బయటికి తీసినప్పటికీ మోటర్ తీసేందుకు వెళ్లిన హీరా బయటికి రాకపోవడంతో రాళ్ళలో ఇరుక్కుపోయి ఉండవచ్చునని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సైదులు తమ సిబ్బందితో శనివారం ఘటనా స్థలానికి చేరుకొని హీరాను బయటికి తీసేందుకు ప్రయత్నించినప్పటికీ ఏ ఒక్కరూ గుంతలోకి వెళ్లడానికి నిరాకరించారు. హీరా మునిగిపోవడానికి నీవే కారణమంటూ మృతుని కుటుంబ సభ్యులు బిచ్చపై దాడికి పాల్పడ్డారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదే గుంతలో గత రెండు నెలల క్రితం ఈతకని వెళ్లి ముగ్గురు మృతి చెందిన ఘటన నుండి మరువకముందే మరో వ్యక్తి గుంతలో పడి గల్లంతవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. శనివారం మధ్యాహ్నం ఘటన జరిగిన కానుండీ సూర్యాపేట డీఎస్పి రవి రూరల్ సీఐ సురేందర్ రెడ్డి స్థానిక ఎస్ఐ సైదులు క్వారీ గుంతలో మృత దేహం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా మృత దేహం లభించలేదు. సీసీ కెమెరాల సహకారంతో సుమారు మూడు గంటలు ప్రయత్నించినప్పటికీ లభించలేదు. ఆదివారం సాయంత్రం ఫైర్ ఇంజన్ సిబ్బంది నీటిని తోడి ఎయిర్ ద్వారా శవాన్ని గుర్తించేందుకు ప్రయత్నం చేశారు. సాయంత్రం వరకు మృతదేహం ఆచూకీ లభించలేదు. అయినప్పటికీ అధికారులు శవం కోసం ముమ్మరగాలింపు చర్యలు చేపడుతున్నారు.



ఘనంగా వినాయక చవితి వేడుకలు

నవతెలంగాణ-తిరుమలగిరి

గణపతి నవరాత్రులను పురస్కరించుకొని తిరుమలగిరి మున్సిపల్ కేంద్రం మరియు మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు మున్సిపల్ కేంద్రం చౌరస్తాలోని నాలుగో వార్డులో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విగ్రహ దాత బత్తుల శ్రీమతి శ్రీధర్‌లు గణేష్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ విఘ్నేశ్వరుడు అన్ని విఘ్నాలను తొలగించి ప్రజలందరిని చల్లగా చూడాలని నిర్వహణ కమిటీ సభ్యులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నిర్వాహన కమిటీ సభ్యులు గుహటి అశోక్, సంకేపల్లి సత్తిరెడ్డి, దామెర సోమయ్య, బుద్ధ బిక్షపతి, గజ్జి శంకర్, చేను శ్రీను, చంద్రారెడ్డి, మామిడాల నరేష్, జగిని ఉమేష్, తుమ్మరాజు, అప్పం వెంకటేశ్వర్లు, గంజి ప్రవీణ్, గూడూరు కృష్ణ, వెంకన్నరమేష్ గూగులోతు శంకర్, నీలం నరసయ్య, శ్రీను, వేణు పాల్గొన్నారు.

చిలుకూరు: వినాయకుని ప్రతిష్ఠ వేడుకలను మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని 17 గ్రామాలలో వినాయకుని విగ్రహాల సంఖ్య గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువగా ప్రతిష్ఠించారు. ఆయా విగ్రహాల కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహిస్తామన్నారు ఐదవ రోజు ఏడవ రోజు 9వ రోజు లడ్డు పాటలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ రోజులలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కమిటీ సభ్యులకు సహకరించాలని కోరారు పోలీసు వారి అనుమతి ప్రకారం డీజేలు నిర్వహించడం లేదన్నారు నిమజ్జనం రోజు కూడా వారు సూచనల మేరకు నడుచుకుంటామని తెలిపారు

పెన్‌పహాడ్: గణేష్ నవరాత్రి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక మండపాల వద్ద భక్తులు శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా ప్రారంభించారు. అందులో భాగంగా మండలంలోని దుపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన మండపంలో అర్చకులు ఇరువంటి నరేందర్ శాస్త్రి ఆధ్వర్యంలో మల్లేపల్లి కరుణాకర్, శైలజ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి నాగేశ్వరరావు-ధనలక్ష్మి, జడ వీరయ్య, గడ్డం నరేష్, జడ అభినవ్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి: భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పండుగను ప్రజలందరూ నిర్వహించుకోవాలని గరిడేపల్లి ఎస్సై చలిగంటి నరేష్ అన్నారు. ఆదివారం మండలంలోని గడ్డిపల్లి లో గల టీవీ రూమ్ వినాయకుడిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపాలు వద్ద డీజే లు అనుమతి లేవని, రాత్రి పది గంటల తర్వాత ఎవరు మైక్ సెట్ లు పెట్టవద్దని ఆయన సూచించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరు ఆన్లైన్లో పోలీస్ పర్మిషన్ కోసం కచ్చితంగా అప్లై చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఎస్సైని శాలువాతో కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి: మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఏం చేద్దాం అనుకుంటుందో ఒక స్పష్టత ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీ విషయంలో అట్టర్ ఫ్లాప్ అయిన ప్రభుత్వం రైతాంగాన్ని గందరగోళ పరిస్థితులలోకి నెట్టేసిందన్నారు. ముఖ్యమంత్రికి మంత్రులకు సరియైన అవగాహన లేకపోవడమే ప్రతి విషయంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఎద్దేవా చేశారు. 49 వేల కోట్లు రైతు రుణమాఫీ అని చెప్పిన ప్రభుత్వం మళ్లీ దాన్ని 31 కోట్లు అని ముఖ్యమంత్రి చెప్పారని ఆ తర్వాత మరోసారి చెప్పి బడ్జెట్లో 26 వేల కోట్లు పెట్టామని చెప్పడం జరిగిందని తెలిపారు.కాగా ఇప్పటివరకు 18 వేల కోట్లు రిలీజ్ చేశామని చెబుతున్నారని కానీ పదివేల కోట్లు కూడా రైతుల వద్దకు చేరలేదని విమర్శించారు. బ్యాంకుల నుండి సమాచారం తీసుకుని రైతులను మోసం చేయడం కోసం అగ్రికల్చర్ అధికారులను కలవాలని బ్యాంకులను కలవాలని కలెక్టర్ ను కలవాలని మళ్ళీ ఇప్పుడు మీ ఊరికే పంపిస్తామని రాష్ట్రంలో ఉన్న రైతులకు ఒక స్పష్టత లేకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రైతులను మోసం చేసిన ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు మోసం చేయాలని చూస్తుందని విమర్శించారు. వానాకాలం వచ్చిన రైతు బంధు ,రైతు భరోసా లేదని వెంటనే రైతు భరోసా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం ,సూర్యాపేట, భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో లక్షలాది పంటలు నష్టం అయ్యాయన్నారు. పెట్టుబడి సాయం ఇవ్వక ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. వరద బాధితుల విషయంలో ప్రజలు అధికారులు నాయకుల నుండి ఏ సహాయం అందలేదని ప్రజలు చెబుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వానికి సోయి లేదని ముందస్తు ప్రణాళిక లేక రాష్ట్ర ప్రజలను రైతులను ఇబ్బందులు పాలు చేస్తుందని ధ్వజమెత్తారు. పరిపాలన అనుభవం లేక సోమరితనంతో వరదల విషయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయలేకపోయారని మండిపడ్డారు. ప్రతిపక్షంగా తమ పాత్ర తాము పోషిస్తుంటే ఆటంకాలు కలిగిస్తున్నారని మండిపడ్డారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నవతెలంగాణ-కోదాడరూరల్

వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఘాటుగా విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని అల్వాల్ పురం గ్రామ సమీపంలో ఉన్న ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ, హుజూర్నగర్ ప్రజలు అన్న బిడ్డలని ఎన్నికలకు ముందు ప్రచారాలు చేసుకొని గెలిచిన తర్వాత కన్న బిడ్డలను గాలికి వదిలేసి హైదరాబాదులో మకాం వేశారని విమర్శించారు. కోదాడ ప్రజలు వరద బీభత్సంలో చిక్కుకొని నీళ్ల కోసం తిండి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబోయే ముఖ్యమంత్రి నని చెప్పుకుంటున్న మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నష్టపరిహారం ఇప్పించడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి వెంటనే ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వరద నష్టాన్ని నాయకుల ఇండ్లలో కూర్చొని కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవంగా నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు. నెమలిపురి గురుకుల పాఠశాల విద్యార్థులు మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఇది నాయకులకు కనబడట్లేదని ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలబడి ప్రైవేట్ ఉద్యోగులకు వేతనాలు లేక పూట గడవని స్థితిలో ఉన్న సమయంలో నిత్యావసర సరుకులను అందజేసే ఆదుకున్నామని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధులు స్థానికంగా ఉంటే అధికారులు సమర్థవంతంగా పనిచేస్తారన్నారు. సుమారు 15 16 వేల ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని రాజకీయాలకతీతంగా నష్టపరిహారాన్ని చెల్లించాలని టిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు నయీమ్, మండల పార్టీ అధ్యక్షులు అక్కెనపల్లి జానకి రామాచారి, నల్ల భూపాల్ రెడ్డి, ములుగురి నాగరాజు, తాళ్లూరి శ్రీనివాస్, గట్ల కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కల్వకుంట్ల బిచ్చం, పార్టీ మండల నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్



భారీ వర్షాలతో మండలంలో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పూసల బోయిన హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అమరవరం గ్రామంలో ఊరకుంట చెరువు కింద భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలు, పంటలను పరిశీలించారు. అనంతరం హుస్సేన్ మాట్లాడుతూ మండలంలోని కాలమై కరువైందని మండలంలో అనేక చెరువులు, కుంటలు తెగి తీవ్రమైన వరదలతో రైతాంగం నష్టపోయిన అన్నదాతను తిరిగి నిలబెట్టేందుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గ్రామాలలో రెవిన్యూ అధికారుల ద్వారా నష్టపోయిన పొలాలలో సర్వే చేయాలని కోరినారు. పంట పొలాలు దెబ్బతిని వారం రోజుగుల గడుస్తున్నా.. రైతుల దగ్గరకు ఏ ఒక్క అధికారి వచ్చిన పాపాన పోలే తక్షణమే అధికారులు స్పందించి రైతులకు తగు న్యాయం చేయాలని కోరినారు. తెగిన చెరువులు, కుంటలు రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, తేనె ధనయ్య, మైలబోయిన శివ, సిద్ధం సైదులు, కదిర సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

నిలిచిపోయిన నీటి తొలగింపు



నవతెలంగాణ-మునగాల

మండల పరిధిలో మాధవరం ఎస్సీ కాలనీ మోకాళ్ళలోతు నిలిచిన వర్షపు నీటిని అధికారులు తొలగించారు. శుక్రవారం రాత్రి మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పొలాల్లో నీరు కాలనీ వైపు మళ్ళింది. నీరు బయటకు వెళ్ళే దారి లేక కాలనీ ముంచెత్తింది. గ్రామ ప్రజలు రెవిన్యూ పోలీసులకు సమాచారం అందించారు.తాహ శీల్దారు, వలిగొండ ఆంజనేయులు ఎంపిడిఓ రమేష్ దీన్ దయాళ్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వరద నివారణకు చర్యలు చే పెట్టారు. జెసిబిని రప్పించారు.గ్రా మం పంచాయితీ సిబ్బంది సహా యంతో నేల మర్రి రోడ్డుకు గండి పెట్టించి చెర్వులోకి వరద నీటిని మళ్ళించారు.అప్పటికే ఇళ్ళలోకి నీరు చేరటంతో పాక్షికంగా సామాగ్రి తడిసి పోయింది. రాత్రి సమయం అయినప్పటికీ తాహశీల్దారు ఆంజనేయులు ఎస్ఐ ప్రవీణ్‌కు మార్ ఇల్లిల్లూ తిరుగుతూ బాధి తుల ఇబ్బందులను అడిగి తెలు సు కున్నారు.అవసరమయిన సహాయం అందిస్తామని హామీ ఇ చ్చారు.మండలంలోని అనేక పల్ల పు ప్రాంతాలు జలమయం అ య్యాయి.మాధవరం కొక్కిరేణి చెరువులు మరోసారి అలుగు పోశాయి. మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం వున్నందున ప్రజలకు అప్రమత్తంగా వుండాలని వారు కోరారు.



ఆర్టీసీ బస్సులు నడిపించాలి

నవతెలంగాణచింతలపాలెం

ఆర్టీసీ బస్సులను యథావిధిగా నడిపించాలని మండల కేంద్రంలో సీపీఐ రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడ నుండి చింతిర్యాల తిరుగుతున్న బస్సులు వెంటనే నడిపించాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. గత పది రోజుల నుంచి కురుస్తున్నటువంటి భారీ వర్షాలకు కోదాడ రోడ్డు కందిబండలో బ్రిడ్జి కూలినదని కాబట్టి ఆర్టీసీ బస్సులను నిలిపివేయడం జరిగిందని, పది రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ప్రజలు ఆర్టీసీ బస్సు వసతు లేక చాలామంది అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాబట్టి తక్షణమే బస్సు డిపో అధికారులు స్థానిక మేళ్లచెరువు చింతలపాలెం మండలాల అధికారులు తక్షణమే స్పందించి వెంటనే బస్సులు కోదాడ హుజూర్నగర్ మల్లారెడ్డిగూడెం చింతిర్యాల బస్సు నడిపించాలని కోరుకుంటూ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి చింతిరాల రవి, గ్రామశాఖ కార్యదర్శి దొంగల అంకరాజు, మహిళా అధ్యక్షురాలు భీమ్శెట్టి పద్మ చిత్తలూరి వీరబాబు, భాష, గోనె అంకయ్య హైమావతి, సత్యం, నాగిరెడ్డి, లక్ష్మి, జయశంకర్, రామయ్య సాయి, శ్రీను, లచ్చిరెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

ఉండ్రుగొండ ఆలయంలో పూజలు

నవతెలంగాణ-చివ్వెంల

మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయములో స్వామివారికి శ్రీదేవి, భూదేవులతో బాద్రపదమాస స్వాతి నక్షత్రము సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణం శ్రీమాన్ చంద్రమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు సహకారంతో అత్యంత వైభవముగా జరిపించారు. ఆలయ కమిటీ కోశాధికారి కృష్ణమోహన్ మాట్లాడుతూ... ప్రతి మాసము జరిగే పౌర్ణిమ సుదర్శన హెూమం యాగశాల నిర్మాణములో ఉన్నందున ఈ బాద్రపదమాస పౌర్ణిమ సుదర్శన హెూమం జరిపించటం లేదన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులుగా సుధీర్‌రెడ్డి, చంద్రశేఖర్

నవతెలంగాణ-తుంగతుర్తి




పీఆర్టీయూ తుంగతుర్తి మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా పాటి సుధీర్ రెడ్డి, పోతురాజు చంద్రశేఖర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పీఆర్టీయూ సర్వసభ్య సమావేశంలో తుంగతుర్తి మండల నూతన కార్యవర్గాన్ని 2024-25 సంవత్సరానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్టీయూ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బాణాల సంతోష్ కుమార్, కార్యదర్శిగా ధరావత్ రఘుపతి,మహిళా ఉపాధ్యక్షురాలుగా బలుగూరి ఎలిజబెత్, మహిళా కార్యదర్శిగా మిరియాల శ్రీదేవిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మేరకు వారిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు జ్యోతుల చంద్రశేఖర్‌కు పిఆర్‌టియు టీఎస్ మాసపత్రిక సంపాదక కార్యవర్గ సభ్యులు తంగెళ్ల జితేందర్ రెడ్డి,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుజ్జ భాస్కర్, జి రాజన్న, ఏ చంద్రశేఖర్ రాష్ట్ర కార్యదర్శి ఎం వేణుగోపాలకృష్ణ,జిల్లా మాజీ గౌరవాధ్యక్షులు కే శివ శంకర్, రాష్ట్ర నాయకులు గోసుల వెంకన్న, దయాకర్, డి ఎల్లయ్య, సీనియర్ సభ్యులు చిత్తలూరి శ్రీరాములు, గోపగాని ఉపేందర్, చంచల వెంకటరమణ, వాంకుడోత్ వెంకన్న, పి సురేష్, గొడుగు అబ్బయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపకార వేతనాలు పంపిణీ



నవతెలంగాణ-హుజూర్ నగర్

పట్టణంలోని వాసవి భవనంలో ఆదివారం కార్యవర్గ సమావేశం వంగవీటి సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగింది రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అధికార ప్రతినిధి కల్వ సుజాత ముఖ్యఅతిథిగా హాజరై పేద ఆర్యవైశ్య విద్యార్థులకు నాలుగు లక్షల 50 వేల రూపాయల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు అదేవిధంగా మరో 33 మంది ఆర్యవైశ్య మహిళలకు పెన్షన్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సుజాతమాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంల ఉన్న పేద ఆర్యవైశ్య పేద కుటుంబాలకు మరిన్ని సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కుక్క డప్పు రామ్మోహన్ రావు గెల్లి అప్పారావు ఓరుగంటి నాగేశ్వరరావు చెన్నకేశవరావు గెల్లి విద్యాసాగర్ నల్లగొండ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గీత పట్టణ వర్ధక సంఘం అధ్యక్షుడు నీరుమళ్ళ నరసింహారావు కౌన్సిలర్లు వేర్లపాటి గాయత్రి ఆర్యవైశ్య మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వంట సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-కోదాడరూరల్



మండల పరిధిలోని తొగర్రాయి గ్రామంలో వరద బాధిత కుటుంబాలకు మధ్యాహ్న భోజన జిల్లా అధ్యక్షురాలు నర్సింగోజు గీత వంట సామాగ్రి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల వచ్చిన వరదలకు గ్రామంలోని మూడు ఇండ్లు లక్ష్మి, ధనలక్ష్మి,సుకన్య లకు సంబంధించిన ఇండ్లు ధ్వంసం కావడంతో వంట సామాగ్రి ,ఒక జత దుస్తులు, దుప్పట్లు , కూరగాయలు మానవతా దృక్పథంతో స్పందించి వారికి అందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వరద బాధితులకు సహాయంగా నిలబడాలి అని ఆమె కోరారు . ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సోమపంగు రాధాకృష్ణ,లైన్ మెన్ వీరబాబు, హేమ జువెలరీ ప్రొప్రైటర్ నాగయ్య రఫీ, రమేష్, అడ్లూరు కాలనీ ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు మనోజ్ కుమార్, ఉపాధ్యక్షులు సందీప్ పాల్గొన్నారు.

సిరి ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని తొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సిరి ఫ్యామిలీ రెస్టారెంట్ (దాబా)ను ఆదివారం మున్సిపల్ చైర్మన్ శాగంటి అనసూయ రాములు ప్రారంభించి పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఈ రెస్టారెంట్లోకి వచ్చే కస్టమర్లకు నాణ్యమైన భోజనం, రుచికరమైన వివిధ రకాల వంటకాలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, నాయకులు నాయిని కృష్ణ మరియు రెస్టారెంట్ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
సోమవారం | సెప్టెంబర్ 09, 2024 | www.navatelangana.com

దాసిరెడ్డిగూడెం వాసికి డాక్టరేట్

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని దాసిరెడ్డిగూడెం కు చెందిన బొడిగె నర్సింహ భౌతికశాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ సాధించారు. ఈ సందర్భంగా బొడిగె నర్సింహ మాట్లాడుతూ ఫిజికల్ (స్పెక్ట్రోస్కోపిక్(ఆప్టికల్ ఈసీఆర్ ఎస్ఐఆర్ అండ్ రామన్) క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఇండియాన్ డోపుడ్ అల్కలైన్ ఎర్త్ ఆక్సైడ్ బొరేట్ గ్లాసెస్ అనే అంశంపై డాక్టర్ జి.రామదేవుడు పర్యవేక్షణలో చేసిన పరిశోధన అంశానికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారని తెలిపారు.మారుమూల గ్రామం నుండి భౌతికశాస్త్రంలో డాక్టరేట్ సాధించడం పట్ల గ్రామ స్తులు, స్నేహితులు, బంధువులు నర్సింహను అభినందించారు.



వరద బాధితులకు అండగా వర్తక సంఘం

నవతెలంగాణ-యాదగిరిగుట

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సర్వస్వం కోల్పోయి అల్లాడుతున్న ప్రజలను ఆదుకోవడానికి కొండపైన వర్తక సంఘం సభ్యులు ముందుకు వచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు తమ వంతు సహాయంగా రూ.లక్ష చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు శనివారం అందజేశారు. యాదగిరిగుట్ట కొండపైన కల్యాణకట్ట నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు కూడ లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు గడ్డమీది మాదవులు సభ్యులు తడక వెంకటేష్‌తో పాటు వర్తక సంఘం సభ్యులు, నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ..

25న ఛలో హైదరాబాద్

- ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి

నవతెలంగాణ-భువనగిరి అర్బన్



ప్రభుత్వాలు మారినా విద్యారంగ సమస్యలు పరిష్కారం కావడంలేదని, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న చలో హైదరాబాద్‌ను నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన విద్యారంగ సమస్యలు పరిష్కారం కావడం లేదని, విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు.సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు నూతన భవనాలు లేక, మెస్ కాస్మోటిక్ చార్జీలు రాక విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు.నాలుగేండ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని విమర్శించారు.ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన విద్యారంగానికి ఒరిగిందేమీ లేదన్నారు.రాష్ట్రంలో విద్యార్థులు తమ సమస్యలను స్వచ్ఛందంగా బయటకు వచ్చి సమస్యలు పరిష్కరించాలని నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు.రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చలో హైదరాబాద్‌కు విద్యార్థులోకమంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, జిల్లా సహాయకార్యదర్శి ఈర్ల రాహుల్,జిల్లా కమిటీ సభ్యులు బుగ్గ ఉదయ్, నాయకులు ప్రశాంత్, సిద్ధు,రాకేష్, అఖిల్,నరేష్,పవన్ పాల్గొన్నారు.

మోటార్ సైకిల్‌యాత్రను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ

నవతెలంగాణ-బీబీనగర్

బునాదిగాని కాలువను అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈనెల 10,11వతేదీలలో ధర్మారం నుండి భువనగిరి కలెక్టరేట్ వరకు నిర్వహించే మోటార్ సైకిల్‌యాత్రను జయప్రదం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. ఆదివారం బీబీనగర్ మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎనిమిది మండలంలోని రైతాంగం, వృత్తిదారులు, ప్రజలు, మూసీజల కాలుష్యంతో అల్లాడుతున్నారని అనేక రకాలైన బాధలు అనుభవిస్తున్నారని తెలిపారు.మూసీ ప్రాంతం మొత్తం పెట్టుబడిదారులకు సంబంధించిన పరిశ్రమల నుండి వస్తున్న విషపు నీరుతో మూసీ నది మురికి కుప్పగా మారిందన్నారు. 2006లో బునాదిగాని కాలువకు శంకుస్థాపన చేస్తే 18 ఏండ్లవుతున్నా పూర్తి స్థాయిలో కాలువ నేటికీ కాలేదన్నారు.కేవలం 34 కిలోమీటర్ల మాత్రమే పూర్తి చేశారని మిగతా 64.64 కిలోమీటర్లు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా మూసీనది కాలుష్యాన్ని నివారించాలని మూసీ ప్రాంత ప్రజల బతుకులు బాగుకోసం పండించే పంట చాపలు, పాలు, కళ్లు, కూరగాయలు విషతుల్యం కాకుండా ఉండడానికి మంచినీళ్ల కోసం గోదావరి, కృష్ణ జల సాధన కోసం



పెండింగ్ కాలువల పూర్తి కోసం అడ్డగూడూరు, మోత్కూరు, ఆత్మకూరు, మోటకొండూరు, వలిగొండ, భువనగిరి, మండలాల మీదుగా ఈ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈనెల 11న బీబీనగర్ కేంద్రానికి చేరుకొని సభా కార్యక్రమం నిర్వహించిన అనంతరం భువనగిరి పట్టణం నుండి కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందాడి దేవేందర్ రెడ్డి, సందెల రాజేష్, ఎరుకల భిక్షపతి, మండల కమిటీ సభ్యులు బాలబోయిన జంగయ్య, బండారు శ్రావణ్, యాదమ్మ, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-భువనగిరి అర్బన్

పట్టణకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో నీళ్లు, డ్రయినేజీ,విద్యుత్ వంటి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరమ్మ కాలనీ శాఖ మహాసభ నిర్వహించి అనం తరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రభుత్వం ఇల్లు కట్టించింది కానీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఇందిరమ్మ కాలనీ ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శ వర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య పట్టణ కమిటీ సభ్యులు బందెల ఎల్లయ్య,వల్దాస్ అంజయ్య, నర్సింహ, సంజీవ,బాలమణి, గంగ పాల్గొనగా నూతన శాఖ కార్యదర్శిగా అప్పలరాములు, సహాయ కార్యదర్శిగా పాలపాటిజయమ్మ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నూతన టీపీసీసీ అధ్యక్షున్ని కలిసిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

టీపీసీసీ అధ్యక్షునిగా ఎన్నికైన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను శనివారం సాయంత్రం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి పూలమాలలేసి సన్మానించారు.శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గోలి పింగళ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, పోతునక్ ప్రమోద్‌కుమార్, తంగళ్ళపల్లి రవికుమార్, బర్రె జహంగీర్, తడక వెంకటేష్, వాకిటి అనంతరెడ్డి, కాంగ్రెస్ వలిగొండ మండలఅధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, పోచంపల్లి మండల అధ్యక్షులు పాక మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.



లింగారెడ్డిగూడెంలో శ్రీముత్యాలమ్మ బోనాలు

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామ ంలో ఆదివారం శ్రీ ముత్యా లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఆటపాటలు, శివసత్తుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో గ్రామ పురవీధులగుండా బోనాలను ఊరేగించారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తొర్పునూరి నర్సింహాగౌడ్, చంద్రయ్యగౌడ్, స్వామిగౌడ్, అంజయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, ఉపేందర్, నరేశ్‌గౌడ్, లింగస్వామి, భగత్, శ్రీకాంత్, కృష్ణ, శేఖర్, మహేశ్, అరవింద్, ఉమేశ్, అరుణ్‌కుమార్, త్రినేశ్, శివ, మహిళలు పాల్గొన్నారు.



విద్యుద్ఘాతంతో హమాలీ కార్మికుడు మృతి

నవతెలంగాణ-ఆలేరు టౌన్

ఆలేరు మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురై, అమాలికారకు కార్మికుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా పెంబర్తి చెందిన జమ్మికృష్ణ (42)హమాలీ కార్మికునిగా ఆలేరు పట్టణంలో పనిచేస్తున్నాడు. పని ముగిసిన అనంతరం నల్లా వద్ద కాళ్ల చేతులు కడుక్కున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాకుకు గురయ్యాడు. విద్యుత్ పోల్ నుండి అన్ కండి షన్‌గా విద్యుత్ సరఫరా కావడంతో నల్లా వద్ద ఉన్న మెట్లకి విద్యుత్తు సరఫరా కావడంతో, పట్టుకున్న కారణంగా విద్యుత్ ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తోటి అమాలి కార్మికులు తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విద్యుత్ శాఖ సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్నికి చేరుకొని విద్యుత్ కనెక్షన్లు పరిశీలించారు.



హరిబాబు కుటుంబానికి బియ్యం పంపిణీ

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు 11వ వార్డుకు చెందిన కాసుల బాధ హరిబాబు (బన్నీఫొటోస్టూడియో) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, 11వ వార్డు కౌన్సిలర్ జూకంటి శ్రీకాంత్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 50 కేజీల బియ్యం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కొన్నే మల్లేష్, బంధు లక్ష్మణ్, కాసుల బాధశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం గుండ్లగూడ గ్రామంలో చెక్కిళ్ళ పరుశు రాములుగౌడ్ రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు శనివారం మరణించగా, వారి కుటుంబాన్ని గుండ్లగూడెం మాజీ సర్పంచ్ ఎసిరెడ్డి మహేందర్‌రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-వలిగొండ

మండలకేంద్రంలోని మల్లేపల్లికి చెందిన గ్రామపంచాయతీ సిబ్బంది పల్లెర్ల మారయ్య, పడిగం సత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు.వారి ఇరువురి కుటుంబ సభ్యులకు వలిగొండకు చెందిన వ్యాపారవేత్త కొండూరు భాస్కర్ ఇరువురి కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆదివారం ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో కాసుల వెంకన్న, పల్లెర్ల సుధాకర్, కొండేరు సాయి, పల్లెర్ల రామచంద్రం, పల్లెర్ల లక్ష్మణ్, గొల్ల క్రాంతి కుమార్, పడిగం యాదయ్య, లక్ష్మయ్య, గొల్ల గణేష్, సహదేవ, మధు, కిషన్ పాల్గొన్నారు.



పరామర్శ

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

తెలంగాణ ఉద్యమనేత, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జిట్ట బాలకృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుం బసభ్యులను బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జనగాం పాండు, బీఆర్ఎస్ పట్టణ ప్రధానకార్యదర్శి రచ్చశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి, నాయకులు సురుపంగసుభాష్, జనగాంమహేష్ పాల్గొన్నారు.



వీధికుక్కల దాడితో గాయాలు

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని గొల్లేపల్లి చెందిన పిట్టల మనీష్, భీమగోని చంద్రమ్మలపై వీధికుక్కలు వారిపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు.వారిని వెంటనే చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాముకాటుతో రైతు మృతి

నవతెలంగాణ-రామన్నపేట

గుర్తుతెలియని విషసర్పం కాటు వేయడంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వెల్లంకి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై పి.మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోటే నరసింహ(55) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు.రోజు మాదిరిగానే తన వ్యవసాయబావి దగ్గరికి వెళ్లి పని చేసుకుని ఇంటికి తిరిగి వచ్చి నాకు ఎట్లాగూ ఉందని భార్యకు చెప్పి మంచంపై పడుకున్నాడు.వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ ను పిలిపించి చూపించేసరికి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.అనంతరం కుటుంబసభ్యులు మృతుడి శరీరాన్ని పరిశీలించగా కుడికాలు పసుపురంగులోకి మారి ఉండడంతో మరింత క్షుణ్ణంగా పరిశీలించగా చూడగా కుడికాలు పెద్దవేలు కింది భాగంలో ఏదో గుర్తుతెలియని పాము కాటు వేసినట్లుగా గమనించి పాముకాటుతో మృతి చెందినట్లు నిర్ధారించుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మృతుడి కుమారుడు మోటే విద్యాసాగర్ ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమాజ్‌పల్లిగౌడ సంఘం అధ్యక్షుడిగా బత్తిని కుమార్‌గౌడ్

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలంలోని నమాత్ పల్లి గ్రామ గౌడ సంఘం అధ్యక్షులుగా బత్తిని కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మట్ట బాలరాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మారగోని మధుసూదన్ గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి దశరథ తెలిపారు. ఆదివారం గౌడసంఘం సమావేశం గ్రామంలో ఏర్పాటు చేయగా, నూతన కమిటీని ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా తునికి ముత్యాలుగౌడ్, మట్ట జంగయ్యగౌడ్, వంగల రమేష్‌గౌడ్, బత్తిని వెంకటేశంగౌడ్, బబ్బురు నర్సింహాగౌడ్, అతికం బాలరాజుగౌడ్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో గౌడసంఘం జిల్లా అధ్యక్షులు అతికం లక్ష్మీనారా యణగౌడ్, మాటూరి బాలరాజుగౌడ్, సంఘం మాజీ అధ్యక్ష కార్యదర్శులు బత్తిని బాలరాజుగౌడ్, బబ్బురి రమేష్‌గౌడ్,అతికం మధుసూదన్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.



టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ నూతన అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిశారు.టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్‌యాదవ్, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు పల్లె శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సాయిధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి వర్థంతి

నవతెలంగాణ-రామన్నపేట

మండలకేంద్రంలో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలోతెలంగాణ సాయుధ పోరాట యోధులు రావినారాయణరెడ్డి 33వ వర్ధంతిని పురస్కరించుకుని నారాయణరెడ్డి చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంతు, వీరమల్ల ముత్తయ్య, గంగాపురం వెంకటయ్య, ఉట్కూరి కృష్ణ, యాదగిరి, బంగారు బాబు, సిహెచ్ మల్లేష్ పాల్గొన్నారు.

భువనగిరిలో జిట్టా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి ఉద్యమ కిరీటం అన్న జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహాన్ని భువనగిరిలో అమరవీరుల స్థూపం పక్కన ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కోరారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో తన ఆటాపాట ద్వారా, తెలంగాణ ధూంధాం జాతరల ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లిన నేత అన్నారు. తన మేనమామ సహకారంతో, చిలుమల ఫౌండేషన్‌తో భువనగిరిలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఫ్లోరైడ్ నిర్మూలన కోసం గతంలో ప్రతిగ్రామానికి వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ బోనాలు, బతుకమ్మ ఆటలు , సంస్కృతి సంప్రదాయాలు, భువనగిరి ఖిలాకు లేజర్ లైట్లను ఏర్పాటు చేసిన గొప్ప నేత అన్నారు.



ఐఐహెచ్‌టీలో సీటు సాధించిన టంగుటూరు విద్యార్థి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన చింతకింది వినయ్‌కి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ (ఐఐహెచ్‌టీ) లో సీటు లభించింది. ఐఐహెచ్‌టీ దేశంలో వారణాసి, సేలం గుహటి, జోద్ పూర్ భార్గర్హ్, శాంతిపూర్, వేంకటగిరి, గడగ్ చంప్శా కన్నూర్ లలో మాత్రమే యూనివర్సిటీలు ఉన్నాయి.ఈ సంవత్సరమే హైదరాబాద్‌లో ఐఐహెచ్‌టి, ప్రారంభబ్యాచ్‌లో 60 సీట్లు మాత్రంమే ఉన్నాయి.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సోమవారం ప్రారంభంకానుంది.దీనిలో సీటు రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని చింతకింది వినయ్ తెలిపారు.

వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలంలోని గౌస్‌నగర్ గ్రామంలో భగత్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహానికి భూషబోయిన నరసింహయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భగత్ యూత్ ఆధ్వర్యంలో 20 ఏండ్లకు వినాయకచవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నల్లమాస ప్రసాద్ గౌడ్, పాక మహేష్‌యాదవ్, సాయి, శివ, కుమార్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.



వాడవాడలా భక్తి శ్రద్ధలతో గణనాథుడి పూజలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

వాడవాడలో భక్తిశ్రద్ధలతో గణనాథుడి పూజలు ఆలేరు పట్టణం, మండలంలోని పలు గ్రామాలలో సంబరాలు అంబరాన్నంటాయి.ఆలేరు మండలకేంద్రంలో శనివారం పట్టణంలోని వాడవాడలా గణనాథుని పూజలు భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. అష్టదిక్పాలకులు, నవగ్రహాలను ప్రతిష్ఠించి, ఆవాహం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలనుపాక రోడ్డు, సంతోష్ మాత దేవాలయం వద్ద, సంతోషి యూత్, ఉత్సవ కమిటీ సభ్యులు, 12వ వార్డు బొడ్రాయి దగ్గర హనుమాన్ యూత్, అమరసింహారెడ్డి అధ్యక్షతన ఘనంగా శ్రీవరసిద్ధి వినాయక పూజ నిర్వహించారు. పట్టణంలోని రెడ్డిగూడెం ,బీసీ కాలనీ, పోచమ్మ వీధి, కురుమ సంఘం, రంగనాయకుల వీధి,చాముండేశ్వరాలయం, బస్టాండ్, మెయిన్ రోడ్డు, సాయిగూడెం, బహదూర్ పేట, సిల్క్‌నగర్,మైత్రి కాలనీ, క్రాంతి నగర్, శాంతినగర్, కాటమయ్యనగర్, చింతలబస్తీ, వడ్డెరబస్తీతో పాటు పట్టణంలోని పలు కాలనీలలో గణనాథులను కమిటీ సభ్యులు నెలకొల్పారు. మండలంలోని కొలనుపాక, రాఘవాపురం, బైరామ్ నగరం, రాజానగరం, మంతపురి, గుండ్లగూడెం, కులాల తండా, కందిగడ్డతండా,పటేల్‌గూడెం,శ్రీనివాసపురం, శారాజీపేట, టంగుటూరు,



యాదగిరిగుట్టలో...

మదనపల్లి, తూర్పుగూడెం, కొల్లూరు, గొలనుకొండ,శర్బనాపురం గ్రామాలలో, ఉపవాస గ్రామాలలో గణనాథున్ని కమిటీ సభ్యులు నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో ఆలేటి రంగన్న పంతులు, వేదాటి సత్యనారాయణశాస్త్రి, భక్తులు శ్రీరామోజు రవీందర్, కృష్ణ ,సోమిశెట్టి మహేందర్, ఎలగందుల సందీప్, బోడ సతీష్,రావులపల్లి సంతోష్ ,జింకల భరత్ యాదవ్, నామాల వెంకటేష్, కుండేవెంకటేష్, పూల అశోక్ మద్దెల వీరస్వామి పాల్గొన్నారు.

గణనాథుడి పూజలో ప్రభుత్వ విప్ బీర్ల

యాదగిరిగుట: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని యాదగిరిగుట్ట పట్టణంలోని పలు వార్డులోని గణనాథుల వద్ద ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారుప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి ప్రసాదం అందజేశారు. అనంతరం పట్టణంలోని ఆయన కార్యాలయంలో నెలకొల్పిన మట్టి గణపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మదుసూదన్ రెడ్డి చీర శ్రీశైలం, గుండ్లపల్లి భరత్ ముఖ్యర్ల మల్లేశ్, సీపీఐ మండల నాయకులు, పెరబోయిన పెంటయ్య బబ్బురి శ్రీదర్ పేరబోయిన మహెందర్ తదితరులు పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో..

రామన్నపేట: పండుగలలో వినాయకుడిదే మొదటి పండుగ అయినందున వినాయకుడి మండపాలలో భక్తి భావం పెంపొందించబడేలా నిర్వాహకులు కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు కూనూరు సాయికుమార్‌గౌడ్ సూచించారు. మండలంలోని భోగారం గ్రామంలో మహాత్మా యూత్‌కి డెకరేషన్, రాఘవేంద్ర యూత్‌కు డీజే సౌండ్స్, మురళీకృష్ణ యూత్‌కు డెకరేషన్, ఏటీఎం యూత్‌కి డిజె సౌండ్స్, శ్రీ సిద్ధి వినాయక యూత్‌కి డెకరేషన్, హనుమాన్ యూత్‌కి, డిజె సౌండ్స్, బజరంగ్ యూత్ డిజె సౌండ్స్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వివిధ వీధుల్లోని గణేష్ మండపాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక ప్రతిమల కోసం ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఆ దేవున్ని పూజిస్తూ నవరాత్రులను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండపాల నిర్వాహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజపేట : రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఎంతో ప్రత్యేకత గల గణనాధుని ఏర్పాటు చేశారు. నంగునూరు సత్యనారాయణ జగదాంబ దంపతులు వారి కుటుంబ సభ్యులు విగ్రహాన్ని ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేసి ఆలయంలోకి భజన చేస్తూ తీసుకువచ్చారు.ఆలయ అర్చకస్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాదశర్మ పూజలు చేయగా మహిళలు మంగళహారతులతో శ్రీ స్వామి వారిని కొలిచారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది. రఘునాథపురం ఆర్యవైశ్య సంఘ భవనంలో మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల సిద్ధి లింగం దంపతులు కుటుంబసభ్యులు విగ్రహ దాత గణనాథుని ఏర్పాటు చేయగా గ్రామంలోని ఆర్యవైశ్యులు హాజరయ్యారు.ఉప్పల శ్రీనివాసులు,ఇమ్మడి శ్రీనివాసులు, ఇమ్మడి నర్సింహులు బుడమ నిశాంత్, బుడమ యశ్వంత్, పెద్ది సంతోష్, ,మార్త జగదీశ్వర్ బుడుమ సత్యనారాయణ, నాళ్ళ శేఖర్, ఉప్పల శ్రీనివాసులు,నంగునూరి రాజు, సోమయ్య, గంగిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రారంభానికి ముందు అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నంగునూరు సత్యనారాయణ జగదాంబ పుణ్య దంపతులు నంగునూరు రాజు సోమయ్య కుటుంబ సభ్యులు చేపట్టారు.

అత్యంత వైభవోపేతంగా గణనాథునికి పూజలు

గణనాథునికి 51 కేజీల లడ్డూ సమర్పణ

భూదాన్‌పోచంపల్లి: పురపాలక కేంద్రంలో మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలను శనివారము ఘనంగా నిర్వహించారు.పురపాలక కేంద్రంలో నేతాజీ యువజన సంఘం యువజన సంఘాల వారు వార్డులలో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.101 యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 22ఫీట్ల భారీ గణనాధుని ప్రతిష్టించారు. యూత్ ఆధ్వర్యంలో గణనాధునికిపూజలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గణనాధునికి లడ్డుదాత మల్లికంటి వంశీ మీన దంపతుల సహకారంతో 51 కేజీల లడ్డూను సమర్పించారు.

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపల్‌తో పాటు పరిధిలోని లింగోజిగూడెం, తంగడపల్లి, తాళ్లసింగారం, లక్కారం, లింగారెడ్డిగూడెంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు, సింగిల్‌విండో చైర్మెన్ చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మెన్ బత్తుల శ్రీశైలం, సీపీఐ(ఎం) మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్, కౌన్సిలర్ దండ హిమబిందుఅరుణ్‌కుమార్ వినాయకుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాణిరుద్రమదేవి సంఘం అధ్యక్షురాలు పోలోజు శ్రీలత, బొబ్బిళ్ల మురళి, మొగుదాల రమేశ్‌గౌడ్, ఉషారాణి, పద్మ, సంధ్య రమణ, రాజశ్రీ, అరుణ, శమంతకమణి, నీరజ, రాణి, బంతి, ఝాన్సీ, ఉమారాణి, లక్ష్మీ, నవనీత, పారిజాత పాల్గొన్నారు.



ఆలేరులో..

కురుమ సంఘం ఆధ్వర్యంలో సీఎంకు రూ.10 లక్షల చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆలేరుటౌన్



వరద బాధితులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు కురుమసంఘం ఆధ్వర్యంలో, ఆకాల వర్షాల వల్ల తెలంగాణలో వరదలతో సర్వస్వం కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు, రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి,తెలంగాణ కురుమ సంఘం తరఫున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, శాసనమండలి సభ్యులు ఎగ్గె మల్లేశం, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రూ.10 లక్షల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షులు అండెం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చండూరు మున్సిపాలిటీకి 100 విధి దీపాలు

నవతెలంగాణ-చండూరు

మునుగోడు శాసనసభ్యులు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి సీడీఫ్ ఫండ్ ద్వారా 10 వార్డులకు వార్డుకు 10 చొప్పున 100 వీధి దీపాలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం అందజేశాయి. ఈ సందర్భంగా మున్సిపల్ పట్టణ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్, వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ట్రస్మా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు, కోఆప్షన్ మెంబర్ ముజ్జు, మాజీ సర్పంచ్ నల్లగంటి మల్లేష్, సంకోజు బ్రహ్మం, గుండారి జనార్ధన్, జూలూరు వెంకటేశం, శంకర్, రాజు, కలీల్ పాల్గొన్నారు.

ప్రాజెక్టుల్లో నీళ్లు ఫుల్.. భగీరథ ట్యాంకుల్లో నిల్...!

- గ్రామాల్లో కొద్ది కొద్దిగా వస్తున్న తాగునీళ్లు
- నిండని మిషన్ భగీరథ ట్యాంకులు
- గ్రామాల్లో మొదలైన తాగునీటి ఎద్దడి

నవతెలంగాణ-పెద్దవూర

మిషన్ భగీరథ ట్యాంక్‌లు ప్రారంభంలో ఆరునెలల ఏ గ్రామంలో చూసినా నిండి పోయి కిందకిపడేవి. ఆ తర్వాత కొంత కాలం నిండుగాపెట్టి ఆపివేసే వారు. 20నెలలుగా మండలంలో ఒక్క ట్యాంక్ కూడా నిండడం లేదు. మార్చి నుంచి జూన్ 15 వరకు కూడా సాగర్ జలాశయంలో నీళ్ల లేవు కాబట్టి సరిపోను ఇవ్వలేదనుకున్నారు. జూన్ 15 నుంచి సాగర్ జాలాశయం నిండిపోయింది. ఇప్పుడు కూడా అంతకు ముందు కంటే తక్కువ సేపు ఎందుకు వస్తున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. తరచూ పైపులు లీకేజీలతో మూడు, నాలుగు రోజులు వరకు నీళ్ల రావడం లేదు పగిలిన చోటనే మళ్ళీ మళ్ళీ పగులుతున్నాయి. అవి పగలకుండా సూసుకునే బాధ్యత, పగలాగానే వెంటనే మరమ్మతులు చేపట్టాలనే ఆలోచన సంబంధిత అధికారులకు ఉండదా ప్రజలు ప్రశ్నిస్తున్నారు.వేసవికాలంలో నాగార్జునసాగర్ జలాశయంలో నీళ్లలేక మండలం లోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. కాని ఇప్పుడు అన్ని ప్రాజెక్టులు నిండుకుండలా వున్నాయి. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండినా కూడా మండలంలో ఏ గ్రామాల్లో ఏఒక్క మిషన్ భగీరథట్యాంక్ నిండా నీళ్ల నింపడం లేదు.దీంతో గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.వేసవి ప్రారంభంలో మండలంలోని గ్రామాల్లో రోజు రోజుకు తాగునీటి ఎద్దడి నెలకొంది. అప్పుడు మిషన్ భగీరథ అధికారులను అడిగితె జలాశయం



డెడ్‌స్టోరేజీకి చేరింది.అందుకే నీళ్ల ట్యాంక్‌లోకి కొద్దిగా వస్తున్నాయని చెప్పారు.వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండితే తప్ప తాగు నీటి సమస్యపరిష్కరం కాదని చెప్పారు. అయితే ఇప్పుడు సాగర్ జలాశయం పూర్తిగా నిండింది అయినప్పటికీ మండలంలో ఎక్కుడా, ఏగ్రామంలోనూ మిషన్ భగీరథ ట్యాంకులు నిండడం లేదని కొద్ది సేపు మాత్రమే కేవలం 5 నుంచి 10 నిముషాలు మాత్రమే వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

శనివారం వినాయక చవితి రోజు కూడా 05 నిముషాలకంటే ఎక్కువ సేపు రాలేదు. లైన్‌మెన్లను అడిగిత మాకేమి తెలుసు పైనుంచే నీళ్ల రావడం లేదుని సమాధానం చెపుతున్నారు.తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు.అయినా సంబంధిత అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు.మండలంలోని 26 పంచాయతీలలో 54 అవాస గ్రామాలు వున్నాయి. అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథవాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు.గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో భూగర్భ జలమట్టం బాగా తగ్గిపోయింది.దీంతో చాలా గ్రామాల్లోని తాగునీటి బోర్లలో నీరు అడుగంటి పైకి రావడంలేదు. కొన్ని గ్రామాల్లో బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. కానీ జాలాశయాల్లో నీళ్ళున్నా ప్రజలకీ సరిపోను తాగునీళ్లు అందలేదు. మిషన్ భగీరథ పైపుల్లో బిందెడు నీటి కోసం గ్రామీణ ప్రజలు చాలా సేపు కొద్దీ నిరీక్షణ చేయాల్సి వాస్తోంది.అంతే గాక మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి పోయింది.వాటిని తొలగించడం లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పైపు లైన్లు అక్కడక్కడ డామేజ అయి పగిలి పోతున్నాయి
మిషన్ భగీరథ ఏఈ పంకజ్‌శర్మ

ఇప్పుడు వ్యవసాసీజన్ రైతులు పొలాలలో దమ్ము చేస్తున్నారు.మొదట్లో పైపు లైన్లు ఎక్కువ లోతులో వేయలేదు. అందుకే కొన్నిచోట్ల పొలాలలో ట్రాక్టర్లు దిగబడి పైపులైన్లు పగిలాయి.అందుకే ట్యాంక్‌ల్లోకి వాటర్ కొంచెం కించెం వస్తున్నాయి.వారం రోజుల్లో పొలాలు నాట్లు పడితే పైపులైన్లు దెబ్బతినకుండా ఉంటాయి.నీళ్ల ఎక్కువగా ట్యాంక్‌లోకి వస్తాయి.

సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

- శౌర్యయాత్రకు స్వాగతం పలికిన కళాకారులు

నవతెలంగాణ-క్లాక్‌టవర్



భూమి, భుక్తి, విముక్తి నినాదంతో ఆరంభమైన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుండి 17 వరకు జరుగుతున్న శౌర్య యాత్ర నల్గొండ పట్టణానికి చేరుకున్న సందర్భంగా సుభాష్ విగ్రహం దగ్గర ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరికి వ్యతిరేకంగా సామాజిక న్యాయ సాధన, అక్షరాస్యత, అందరికీ అభివృద్ధి, సమసమాజ స్థాపన అనేదిశగా సాగిందని అన్నారు. తొలుత ఆంధ్ర మహాసభ అండతో సాంస్కృతిక సమరంగా మొదలై 1946 జూలై 4న కడివెండిలో దొడ్డి కొమరయ్య అమరత్వంతో సాయుధ పోరాట ఫిరంగులై పేలింది అన్నారు. ఈ మహోజ్వల పోరాటంలో దొరలు, జాగిర్దారుల దౌర్జన్య క్రీడలు, నిజాం సేనల నిరంకుశ దాడులు, రజాకార్ల దోపిడీ ఆకృత్యాలు , నెహ్రూ సైన్యాల అరాచకాల అన్నింటినీ మట్టి కల్పించిన వీరులను స్మరించుకుంటూ, నేటి పాలకులు నాటి చరిత్రను వక్రీకరిస్తూ హిందూ ముస్లిం మత తగాధ గా చూపిస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొడుతూ సాగుతున్న శౌర్య యాత్ర అని అన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్ మాట్లాడుతూ 4000 మంది అమరుల రక్తతర్పణం , 3000 గ్రామాల్లో ప్రజారాజ్యం, 10 లక్షల ఎకరాల భూ పంపిణీ ,వెట్టిచాకిరి రద్దు ఇలా అనేక అంశాలకు పునాదిగా నిలిచింది వీర తెలంగాణ సాయుధ పోరాటం అని అన్నారు. నిజాం రజాకార్లను నెహ్రూ సైన్యాలను మట్టికరిపించి ఈ నేలను వీర భూమిగా రూపుదిద్దిందని అన్నారు. నాటి మహోత్తర పోరాటానికి ఇంధనం ప్రజా కలలే అని అన్నారు. తెలంగాణ అమరుల ను స్మరించుకునేందుకు ఉద్యమ పల్లెల్ని, యోధుల సమాధుల్ని సందర్శించేందుకు ఆటపాటల్లో వారి ఆశయాలను నెమరు వేసుకొని రేపటి దిశగా నడిపించేందుకు శౌర్య యాత్ర చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, చిన్నపాక లక్ష్మీనారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, కుమ్మరి శంకర్ , రాష్ట్ర కమిటీ సభ్యురాలు చింతల విజయ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, పోలే సత్యనారాయణ, ప్రజానాట్యమండలి కళాకారులు ఎం జె వినోద్ కుమార్ వేల్పుల వెంకన్న శివ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షున్ని మర్యాద పూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన మహేష్ కుమార్‌గౌడ్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు నియోజకవర్గ శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్‌గౌడ్ నియమిచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే పదవులు దక్కుతాయని చెప్పడానికి మహేష్ కుమార్‌గౌడ్ నియామకమే చక్కటి ఉదాహరణ అన్నారు.ఆయన ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండేం సంజీవరెడ్డి తో పాటు నియోజకవర్గం లోని ,మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు,ఆలేరు నియోజకవర్గం లోని అన్ని మండలాల అధ్యక్షులు,పట్టణ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తెగిన బిడ్జికి మరమ్మతులు ప్రారంభం



- స్తంభించిన రాకపోకులకు పునరుద్ధరణ
- యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఇటీవల కురిసిన వర్షాలకు మిర్యాలగూడ మండలంలోని తక్కలపాడు గ్రామంలో ఉన్న పాలేరు వాగు వంతెనబిడ్జి కొట్టకపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ వెంటనే వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని చెప్పడంతో ఆదివారం వంతెన నిర్మాణం పనులు చేపట్టారు.ఇటీవల కురిసిన అకాలవర్షాల కారణంగా వంతెన కొట్టుకోపోవడంతో సుమారు 50 ఎకరాలు నష్టపోయాయి వంతెన అవతల ఉన్న 400 ఎకరాల రైతుల రాకపోకలు నిలిచి పోయాయి. దింతో రైతుల ఇబ్బందుల దృషిలో ఉంచుకొని తాత్కాలిక మరమ్మతుల కింద రూ.6 లక్షలను మంజూరు చేశారు. ఎమ్మెల్యే ఆదేశం ప్రకారం వెంటనే మరమత్తులు చేపట్టారు. సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గుండు నరేందర్ గౌడ్ మాట్లాడుతూ రైతులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని ఎమ్మెల్యే చెప్పడంతో వెంటనే పాలేరు వాగు వంతెన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. యుద్ధప్రతిపాదికన బిడ్జి పనులను ప్రారంభించి ఒకటి రెండు రోజుల్లోనే పూర్తిగా రాకపోకలకు అనుకూలంగా చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు.స్థానిక ఎమ్మెల్యే బీఎల్ఆర్ చొరవతో అధికార యంత్రాంగం పనులను చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే 78 లక్షలతో శాశ్వత బ్రిడ్జి నిర్మాణం పకడ్బందీగా నిర్మిస్తామని తెలిపారు. ఈ బిడ్జి మరమ్మతులు పూర్తయితే వ్యవసాయదారులకు వ్యాపారస్తులకు మేలు చేసిన వారమవుతావున్నారు.ఆయన వెంట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నేలమట్టమైన పేదల ఇండ్లను నిర్మించాలి

- పీవీసీ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-సూర్యాపేట



ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సుందరయ్య నగర్ పేదల ఇండ్లు నేల మట్టం కావడానికి కారణమైన సుధాకర్ పీవీసి కంపెనీ యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకొని కంపెనీని సీజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కొరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంపెనీ నీరు పిల్ల కాలువ ద్వారా సుందరయ్య నగర్ ఇండ్లలోకి వదలటం వల్ల కంపెనీ ప్రహరీ గోడ కూలీ ఇండ్లపై పడి 8 ఇండ్లు కూలి పలువురుకి కాలు చేతులు, తల పగలి హాస్పిటల్ పాలు అయ్యారని పేర్కొన్నారు. ఇంతవరకు కంపెనీ యండి మీలా మహదేవ్ మానవత్వంతో కూడా వ్యవహరించకుండా తనకున్న అర్థిక, రాజకీయా బలాన్ని ఉపయోగించి తాను ఏమీ చేయను, నాకు ఏమి సంబంధం లేదని మాట్లాడటం దుర్మార్గమని నెమ్మాది విమర్శించారు. పోరాడి సాధించుకున్న పేదల ఇండ్ల పైకే కంపెనీ మురికి నీరు వదలటం వల్ల ఇండ్లు నేల మట్టం కావడం తినటానికి సరుకులు లేకపోవడంతో పాటు వంట సామాగ్రి కూడా శిధిలాల కింద పడి పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఉండటానికి కనీసము నీడ లేకుండా బయట తల దాసుకుంటున్నారని తెలిపారు. సుందరయ్య నగర్ భాదితులు రోజు వారీ కూలీలు,కార్మికులు దళితులు, గిరిజనులు, మైనార్టీలు ఉన్నారని ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగిన కలెక్టర్ సుందరయ్య నగర్ భాదితులనీ పునర్వాసం కలిపించక పోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కూలీ పోయిన ఇండ్ల స్థానంలో పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు. గాయపడ్డ బాధితులకు ప్రతి ఒక్కరికీ రూ.50 వేలు నష్టం పరిహారం ఇవ్వాలని, ప్రతి కుటుంభానికి ఇంటి సామాగ్రి కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. ప్రహరీ గోడ నిర్మాణము వెంటనే చేపట్టి వరద కాలువ కోసం తీసిన సుధాకర్ పీవీసీ కాలువ వెంటనే మూసి వేయాలనీ డిమాండు చేశారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం రాంబాబు, కోశాది కారి కె వెంకట నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వట్టేపు సైదులు, ఎం ముత్యాలు, యాత్తాకుల వెంకన్న, రస్ మియా, వజ్జే సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన బీజేపీ, కాంగ్రెస్

- ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడేది ఎర్ర జెండానే
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు



దేశంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చక మోసం చేస్తున్నాయని, ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడేదే ఎర్ర జెండానే అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని కొండాపురం పార్టీ గ్రామ శాఖ, నేర్మట గ్రామశాఖ ఆరవ మహాసభలు నేర్మట గ్రామంలో జెర్రిపోతుల ధనంజయ గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఈ నెలాఖరులో శాఖ మహాసభలు పూర్తి చేయాలని, అక్టోబర్ నెలలో మండల మహాసభలు జరపాలనిఆయన అన్నారు. డిండి ఎత్తిపోతల పథకం డిపిఆర్‌ను ఆమోదించ వరకు పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని ఆయన అన్నారు. మునుగోడు, దేవరకొండ ప్రాంతాలలో ఉన్న ప్రాజెక్టుల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొమ్మిది సంవత్సరాలు గడిచిన ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయకపోవడం గత ప్రభుత్వ వైఫల్యమైనని ఆయన అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చర్లగూడెం రిజర్వాయర్, కిష్టరాంపల్లి రిజర్వాయర్, సింగరాజుపల్లి ప్రాజెక్ట్, గొట్టిముక్కల ప్రాజెక్టుల పనులు త్వరగా పూర్తి చేయాలి అన్నారు. 2019 ఎన్నికల మానిఫెస్టోలో బిజెపి నిరుద్యోగ భృతి 5000 రూపాయలు ఇస్తామని ప్రకటించి, మళ్లీ దాని ఊసేత్తడం లేదుఅని ఆయన అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం 3116 రూపాయల నిరుద్యోగ భృతి అందజేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసంచేసింద న్నారు.ఇప్పుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో 4000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఊసేత్తడం లేదు అని ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే యువత, నిరుద్యోగులు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు వాగ్దాన భంగం అయిందని, బిజెపి నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగుల భర్తీ చేస్తామని అన్నారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాలు కూలిపోయాయని, ఇప్పుడు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులుకొత్తపల్లి నరసింహ, నూతన గ్రామ శాఖ కార్యదర్శి బల్లెం స్వామి, శాఖ కమిటీ సభ్యులుగా అంతిరెడ్డి, ఈరగట్ల స్వామి, ఈరటి వెంకన్న,నారపాక శంకర్, కొత్తపల్లి లక్ష్మమ్మ, లింగమ్మ, యాదయ్య, వెంకన్న పాల్గొన్నారు.



గురుకుల ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్

నవతెలంగాణ-క్లాక్‌టవర్

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం, టీచర్స్, లెక్చరర్స్ డీఈఓ, ఏఎన్ఎం, అసిస్టెంట్ కేర్ టేకర్ (ఏసీటీ)లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మంపాటి శంకర్‌లు మాట్లాడారు. ప్రభుత్వం ముందస్తు సమాచారం లేకుండా మౌఖిక ఆదేశాలతో ఎవ్వరూ వీధులకు రావద్దని సెక్రెటరీ ఆయా ప్రిన్సిపాల్‌లకు తెలపడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనుకకు తీసుకొని తీసివేసిన ఉపాధ్యాయులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల తొలగింపుతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబాలకు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంల ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ భేరర్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య, కోరే తదితరులు పాల్గొన్నారు.

కుక్కలబెడద నుండి ప్రజల్ని రక్షించాలి

నవతెలంగాణ-చండూరు



కుక్కల బెడద నుండి చండూరు మున్సిపల్ ప్రజల్ని రక్షించాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు పందుల సత్యం గౌడ్ సంబంధిత అధికారులు కోరారు. ఆదివారం అంగడిపేటలో నిన్న వీధి కుక్కల దాడిలో ఐదు గురికి విచ్చేవాహితంగా గాయపరిచిన వారిని ఆయన పమర్శించారు. వారికి పండ్లు, బ్రెడ్డు ప్యాకెట్లు పంపిణీ చేశారు. గతంలో కూడా 60 మంది పైగా కుక్క కాటుకు గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల గురించిపై అధికారులు ఎన్ని సార్లు మొరపెట్టిన ఎలాంటి స్పందన లేదన్నారు.ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి కుక్కల బారి నుండి ప్రజలను రక్షించాలని డిమాండ్ చేస్తుంది.లేనిచో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతాం అనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నరసింహ, రాష్ట్ర ఓబీసీ మోర్చ అధికార ప్రతినిధి కోమటి వీరేశం, సీనియర్ నాయకులు తడకమల్ల శ్రీధర్, ఇరిగి ఆంజనేయులు, కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి సామ వెంకటరెడ్డి, ఎస్సీ మోర్చా మున్సిపల్ అధ్యక్షుడు ఇరిగి కుమార్, మధగొని నాగార్జున, మున్సిపల్ అధికార ప్రతినిధి భూతరాజు స్వామి, పెద్దబోయిన శంకర్,రామ్ శెట్టి, బోయపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యానాల లింగారెడ్డి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి



నకిరేకల్:తెలంగాణ ఉద్యమకారుడు యానాల లింగారెడ్డి హఠాన్మరణం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డు రోడ్డులోని స్వగృహంలో ఆయన మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు గాజుల సుకన్య, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి యాతాకుల అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బచుపల్లి గంగాధర్ రావు తోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు, సందర్శించి ఆయన మృతదేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ప్రమాదవశాత్తు పాము కాటుకు గురై మృతి చెందడం బాధాకరమన్నారు. చిన్న వయసులోనే ఆయన లోకాన్ని విడిచి పెట్టడం బాధాకరమన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. యానాల లింగారెడ్డి అంతిమయాత్ర ఆదివారం సాయంత్రం జరిగింది. పట్టణం లోని మార్కెట్ రోడ్డు నివాసం నుండి వ్యవసాయ క్షేత్రం వరకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పాడేమోసి భావోద్వేగానికి గురయ్యారు. అంతిమయాత్రలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, టిపిసిసి మేనిఫెస్టో కమిటీ సభ్యులు చామల శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు గాజుల శ్రీనివాస్, మాద యాదగిరి, పన్నాల రంగమ్మ రాఘవరెడ్డి, మాచర్ల సైదులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కూలిన ఇండ్లు

- నూతన గృహాల కోసం ఎదురు చూపులు

నవతెలంగాణ-పెన్‌పహాడ్



గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామానికి చెందిన సద్దల లక్ష్మమ్మ ఇల్లు పాతగోడలు కావడంతో వర్షం నీటికి నాని శుక్రవారం కూలింది. దాంతో లక్ష్మమ్మ కుటుంబం వర్షంలో రోడ్డున పడింది. ఎన్నో ఏళ్లుగా నూతన గృహాల కోసం ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగులుతుంది. గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకం పేరు కింద మంజూరు చేసిన ఇళ్లను నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందన్న ఇందిరమ్మ ఇళ్ల నేటికీ కలగానే మిగిలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన గృహాలు ఇంకా ఎప్పుడు ఇస్తారోనని పాత మట్టి గోడల ఇల్లులు, కిరాయి ఇళ్లలో నివసించే ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఇకనైనా ఇల్లులు కట్టుకునే వారికి ఆర్థిక సహాయం అందించి, నూతన గృహాలు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే కూలిన ఇంటిని ఆర్ఐ రంజిత్ రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం నుండి బాధితులకు సహాయం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రత్యేక పాలనతో గ్రామాలు అస్తవ్యస్తం

నవతెలంగాణ-వేములపల్లి



ప్రత్యేకపాలనతో గ్రామాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లా డారు. గ్రామాల్లో సర్పం చుల హయాంలో గ్రామ సభలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు అన్నారు. కానీ ప్రత్యేక అధికారులు గ్రామ సభలు నిర్వహించకపోవడం వల్ల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తే నిధులు లేవని దాటవేస్తూ న్నారన్నారు. గుట్టు చప్పుడు కాకుండా అధికారులు ఎంబిలు చేసుకొని నిధులు డ్రా చేస్తున్నట్లు, ఈ విషయమై మండల అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ కార్యాలయానికే పరి మితమయ్యారన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో అవినీతి జరగ కుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, చారి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు. తిరుమలగిరి మండల కేంద్రం వంగపల్లి నరసయ్య ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఎస్సై వి. సురేష్ అధ్యక్షతన నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల అవగాహన సదస్సు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.ఈ కార్యక్రమంలోపోలీస్ సిబ్బంది, నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండపాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విఠలాచారికి ఘనంగా సన్మానం

నవతెలంగాణ-నిడమానూరు

పద్మ శ్రీ అవార్డు గ్రహిత విఠలాచారికి ఘనంగా శాలువా కప్పి సన్మానించారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్వ బ్రాహ్మణ కమిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం మండలకమిటీ ఆధ్వర్యంలో విఠలాచారి కి పద్మ శ్రీ అవార్డు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.తన ఇంటినే లైబ్రరీగా మార్చి అందరికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.సన్మానించిన వారిలో మాజీ ఎంపీటీసీ విశ్వనాధులరాణి రమేష్‌చారి, కాసోజు కృష్ణమాచారి, కాలే వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలి'



నవతెలంగాణ-కొండమల్లేపల్లి

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, దేవరకొండ మున్సిపల్‌చైర్మెన్ ఆలంపల్లి నరసింహులు అన్నారు.ఆదివారం పట్టణంలోని దేవరకొండ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి జై రామ్ హాస్పిటల్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు.ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ వైద్య సహాయం కోసం వచ్చేటటువంటి ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలను అందించాలని కోరారు. అన్ని వసతులతో కూడిన ఇలాంటి హాస్పిటల్ కొండమల్లేపల్లి పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్. భరత్‌సింగ్, డాక్టర్. ఉషారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఊటుకూరి వేమన్‌రెడ్డి, మండల ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏరుకొండ రాము, మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్, నీలం శ్రీనివాస్‌యాదవ్, వసకుల బక్కలయ్య, ఏరుకొండ సైదులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రెస్‌అకాడమి చైర్మెన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

పట్టణంలోని కేశ్యతండా వద్ద ఉన్న బధిరుల పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కొండమల్లేపల్లి మండల ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏరుకొండ రాము ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులకు అండగా ఉంటూ ఆయురా రోగ్యాలతో ఉంటూ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో విలేకర్లు సతీష్, వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అందని సహకారం

- సహకార సంఘాల్లో లోన్లు తీసుకోకున్నా.. తీసుకున్నట్లు రికార్డులలో నమోదు
- అర్హత ఉన్న లిస్ట్‌లో పేర్లు లేవని రైతుల ఆందోళన
- ఫిర్యాదులతో వెలుగులోకి వస్తున్న అక్రమాలు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణామాఫీని సవాలుగా తీసుకొని అమలు చేస్తుండగా.. జిల్లాలో అధికారుల తప్పిదంతో సహకార సంఘాలలో రుణాలు తీసుకున్న రైతులకు శాపంగా మారాయి. జిల్లాలో పలు సహకార సంఘాల్లో రైతులు రుణాలు తీసుకోనప్పటికీ రుణాలు తీసుకున్నట్లుగా వెలుగులోకి వస్తున్నాయి. దీనితో రైతులు ఆందోళన చెందుతుండగా న్యాయం కోసం ఆఫీసర్ల చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నారు. రైతాంగం ఎన్నో ఆశలతో సహకార రుణాల కోసం ప్రాథమిక సహకార సంఘాలలో చేరితే రైతులకు టోకరా ఇస్తున్న పలు సహకార సంఘాల అక్రమాలు తెరపైకి వస్తున్నాయి.

రైతులను బురిడి కొట్టిన సహకార సంఘాలు..

రైతు రుణామాఫీతో గతంలో జరిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నెలకొన్న అక్రమాలు ఒక్కొక్కటిగా తెర పైకి వస్తున్నాయి. జిల్లాలో పలు సహకార సంఘాల్లో రైతులు రుణాలు తీసుకోక పోయిన రుణాలు తీసుకున్నట్లు తెలుతున్నాయి. ఈ పరిమాణాలు కొత్తగా తీసుకున్న రుణామాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. తుంగతుర్తి నియోజక వర్గం తిరుమలగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో భారీ మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈ సొసైటీలో దాదాపు 48 మంది రైతుల పేరు మీద సొసైటీలోనే సభ్యులు రుణాలు తీసుకుని బురిడి కొట్టించాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు సంబందిత రైతులు ఫిర్యాదు చేయడంతో సొసైటీ లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మునగాల మండలం రేపల్లె సహకార సంఘం సొసైటీలో సైతం ఇదే తరహాలో రైతుల పేరుపై కొంతమంది సభ్యులు రుణాలు తీసుకొని రైతులను మోసం చేయడంతో సొసైటీ లోని రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

అధికారుల నిర్లక్ష్యం..

ప్రభుత్వం మంచి సంకల్పంతో రైతు రుణామాఫీ చేస్తుంటే సూర్యాపేట జిల్లాలో రుణాల మాఫీకి అధికారుల అలసత్వం కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవైపు పలు సహకార సంఘాల్లో రైతుల పేరుతో అక్రమంగా లోన్లు లేపడం వెనుక అధికారుల హస్తం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతుండగా మరోవైపు అధికారులు స్పష్టమైన డేటా పంపని కారణంగా రుణామాఫీకి ఆటంకం కలుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి



అధికారులు రైతుల పేరుతో చెల్లించిన రుణాల స్థానంలోనే కొత్త రుణాలు తీసుకోవడంతో తాజాగా అమలవుతున్న రుణామాఫీలో రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నది. రైతులు రుణం తీసుకొనప్పటికి రెండేసి బ్యాంకులలో రుణాలు తీసుకున్నట్లు తాజా రిపోర్టులలో వస్తుండడంతో రైతులకు రెండు లక్షల రుణామాఫీ అమలులో తీవ్రమైన నష్టం అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్నీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవ సహకార కేంద్రాలు, కేంద్ర సహకార బ్యాంక్ శాఖలో సమగ్రంగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

రుణం తీసుకున్నట్లు రిపోర్ట్‌లో వస్తుంది
శ్రీనివాసులు(తాటికొండ గ్రామం, తిరుమలగిరి మండలం)

నేను సహకార సొసైటీలో ఎలాంటి రుణం తీసుకోకున్నా రూ.50 వేలు తీసుకున్నట్లు రిపోర్టలలో వస్తుంది. ఇప్పుడు కొత్తగా అప్పు కోసం వెళితే లోన్ తీసుకున్నట్లు ఆఫీసర్లు చెప్తున్నారు.

ఎంక్వైరీ చేస్తున్నాం
సూర్యాపేట డీసీఓ జిల్లా అధికారి పద్మ

రైతులు రుణాలు తీసుకోకున్నా.. తీసుకున్నట్లు వస్తుందని కొంతమంది రైతులు ఫిర్యాదులు చేశారు. సొసైటీలలో జరిగిన అక్రమాలపై ఎంక్వైరీ చేస్తున్నాం. రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

దేవరకొండలో ప్రయివేట్ ఆస్పత్రిపై దాడి

- చికిత్స పొందుతూ 5 రోజుల పసికందు మృతి
- డాక్టర్ నిర్లక్ష్యంతో మృతి చెందాడని బంధువుల ఆందోళన , ఫర్నీచర్ ధ్వంసం

నవతెలంగాణ-దేవరకొండ

నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో న్యూ రెయిన్బో ప్రయివేట్ పిల్లల ఆస్పత్రిపై మృతి చెందిన 5 రోజుల పసికందు కుటుంబ సభ్యులు, బంధువులు దాడి చేశారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ రాస్తారోకో, ఆందోళనకు దిగారు. దాడిలో ఆసుపత్రి అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం అయిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పోలీసుల జోక్యంతో ఆందోళన విరమించారు. పట్టణంలోని న్యూ రెయిన్బో ప్రైవేటు ఆసుపత్రిలో 5 రోజుల మగ పిల్లవాడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం దేవరకొండ నియోజకవర్గంలోని డిండి మండలం ఎర్రారం గ్రామపంచాయతీ పరిధిలోని సోమ్లాతండాకు చెందిన ఇస్లావత్ జ్యోతి రమేష్ దంపతులు మొదటి కాన్పు 2018 లో ఆడపిల్లకు జన్మనిచ్చారు. అప్పటినుండి పిల్లల కోసం ఎదురు చూస్తున్న దంపతులకు రెండవ కాన్పులో ఈ నెల 3 వ తేదీన స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మగబిడ్డ జన్మించాడు. పిల్లవాడికి పసిరికలు వచ్చాయని తనప్రయివేట్ హాస్పిటల్ కు తీసుకురావాలని వైద్యుడు బాబురావు జ్యోతి రమేష్ దంపతులకు చెప్పడంతో ఈనెల 6వ తేదీన రెయిన్బో ప్రయివేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. శుక్రవారం నుండి చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం బాలుడు మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని బంధువుల ఆరోపిస్తూ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆసుపత్రి అద్దాలు, ఫర్నిచర్



ధ్వంసం చేశారు. బాలుని పరిస్థితి విషమంగా ఉందని భయమ వుతుందని డాక్టరుకు చెప్పినప్పటికీ వినకుండా అంతా బాగానే ఉందంటూ డాక్టర్ చెప్పాడని, ఇంతలోనే బాలుడు మృతి చెందడం దుఃఖంతో రమేష్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ సొంత ప్రైవేటు హాస్పిటల్ కు తీసుకురమ్మని వైద్యుడు చెప్పడం ఏమిటని బంధువులు ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తూ సొంత ప్రయివేట్‌ఆస్పత్రికి రావాలని చెబుతున్నా ప్రయివేట్ ఆస్పత్రులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే వైద్యం వికటించి మృతి చెందాడని ఆరోపిస్తూ, డాక్టర్ పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు ,బంధువులు డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న సీఐ నర్సింహులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిచారు.

ఆసరా కోసం ఎదురుచూపులు

- రహదారులు మొత్తం బురదమయం
- గ్రామంలో కనిపించని వినాయక చవితి సందడి

నవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని తొగర్రాయి గ్రామాన్ని ఆదుకునే వారి ఆసరా కోసం గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు. అప్పటికి కొంతమంది నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అధికారులు అన్నదాన కార్యక్రమాలు, దుస్తులు, త్రాగునీరు పంపిణీ చేస్తున్నారు. నారాయణపురం చెరువు కట్ట తెగడంతో ఆ వరద తొగర్రాయి గ్రామంలో ప్రతి ఇంటికి నడుము లోతు నీటీ ప్రవాహం వచ్చింది అని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఆ వరద సాయంత్రం పూట రావడం జరిగిందని అదే రాత్రి సమయంలో వచ్చి ఉంటే పెను ప్రమాదం గ్రామానికి జరిగేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ వరద ఉధృతికి సంబంధించిన



ఛాయలు ఆ గ్రామంలోని గోడలపై కనిపిస్తున్నాయి. వరద ఉధృతికి తొగర్రాయి గ్రామంలోని కొత్త ఊరు పాత ఊరు మధ్య బ్రిడ్జి తెగిపోవడంతో అధికారులు రాళ్ల మట్టితో బ్రిడ్జి నిర్మించారు. వర్షాలు రావడంతో ఆ బ్రిడ్జి పైన బురద చేరడంతో మహిళలు వృద్ధులు నడవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఎటు చూసినా విరిగిన స్తంభాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు వాటి పునరుద్ధరణ పనిలో ఉన్నారు. రైతులు తమ పొలాలు నామరూపం లేకుండా ఉన్న పొలాలను జెసిబి సహాయంతో యధా స్థితికి తెస్తున్నారు. పొలాల్లో ఉన్న బావులు వరద ప్రవాహానికి బూడిపోవడంతో రైతులు అవస్థలు వర్ణనాతీతం. రైతులు తమ పొలాల్లో ఉన్న మోటర్లు కూడా కొట్టుకొని పోయినాయని దొరికిన మోటార్లను తీసుకువచ్చి రిపేర్లు చేయిస్తున్నట్లు తెలుపుతున్నారు. గ్రామంలో వినాయక చవితి పండుగ సందర్భంగా అక్కడక్కడ విగ్రహాలు ఏర్పాటు చేశారు కానీ ఆ ప్రదేశాలలో ఎలాంటి సందడి కూడా లేదు అని గ్రామస్తులు తెలుపుతున్నారు. గ్రామంలోని ప్రజలు తమ వస్తువులు వరద ఉధృతికి ఎటు పోయాయోనని వరద వచ్చిన ప్రదేశంలో వెతుకులాట జరుపుతున్నారు. తొగర్రాయి గ్రామం గుండా వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి కూడా వరద తాకిడికి గురైంది దీంతో బ్రిడ్జి కింద ఉన్న మట్టి చాలా వరకు కొట్టుకొని పోవడంతో వాహనాలు వెళ్లడానికి ప్రమాదకరంగా మారింది. స్పందించి నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు తొగర్రాయి గ్రామానికి ఆసరాగా నిలవాలి అని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు రబీయాబి మృతి బాధాకరం

- నివాళులర్పించిన సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-డిండి

ఆదర్శ కమ్యూనిస్టుగా, సినీయర్ సభ్యురాలుగా రబీయాబి చివరి శ్వాస వరకు సీపీఐలో ఉండడం ఆదర్శప్రాయమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు.ఆదివారం కందుకూరు గ్రామంలో సాయుధ పోరాటంలో నాడు కమ్యూనిస్ట్ పార్టీ బుర్రకథ దళంలో క్రియాశీలకంగా పార్టీ నిర్మాణం కోసం పనిచేసిన అమరజీవి కామ్రేడ్ బంధగి సతీమణి రబియాబి పార్థివదేహంపై ఎర్రజండాను కప్పి పూలమాలేసి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీలో నిర్మాణం కోసం బుర్రకథ దళంలో పని చేసిన అమరజీవి కామ్రేడ్ బందగీ భార్య రబియాబి ఎంతో కాలం కమ్యూనిస్టు పార్టీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలుగా, సీపీఐ సినీయర్ సభ్యురాలుగా పనిచేశారన్నారు.రబియాబీ కుమారుడు మైనోద్దీన్ సైతం ప్రస్తుతం జిల్లా కమ్యూనిస్టు పార్టీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తూ కుటుంబం మొత్తం కమ్యూనిస్టు పార్టీలో ఉండడం గమనార్హం అన్నారు. రబియాబి మృతి బాధాకరమని, ఆమె జీవితం నేటి మహిళాలోకానికి ఆదర్శప్రాయమన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, తూంబుచ్చిరెడ్డి, సీపీఐ డిండి, దేవరకొండ మండల కార్యదర్శులు శ్రీరామదాసుకనకాచారి, దేపాసుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం దేవరకొండ మండల కార్యదర్శి పల్లా రంగారెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వల్లమల్ల ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రవీంద్రశర్మ, విజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనయ్య, కేశవులు, లచ్చయ్య, శాఖ కార్యదర్శులు శ్రీను, చక్రి, హన్మంత్, యాదయ్య, గోవర్ధన్, ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుడు కృష్ణకాంత్‌కు సన్మానం

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్

ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో గణితాన్ని భోదిస్తున్న గిరిజన ఉపాధ్యాయుడైన కృష్ణకాంత్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందడం పట్ల ఆదివారం ఆయన్ను ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి ఎస్టీ, ఎస్సీ,బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు కృష్ణకాంత్ నాణ్యమైన విద్యనందిస్తూ హాస్టల్లో చదివే విద్యార్థులకు ప్రతిక్షణం తమ సమయాన్ని కేటాయించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.పేద విద్యార్థులకు పరీక్ష ఫీజు కట్టలేని స్థాయిలో ఉంటే తమ సొంత పైసలతో వారి పరీక్ష ఫీజులు కడుతూ విద్యార్థులకు సహాయపడుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సైలాబ్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి న్యూమాన్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, నాయకులు నగేష్, సూర్య, రమేష్, ఆనంద్, ఉపేందర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సన్మానం



నవతెలంగాణ-ఆలేరుటౌన్

జర్నలిస్టు డే సందర్భాన్ని పురస్కరించుకుని, ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్ధన్ అధ్యక్షత వహించారు. సీనియర్ జర్నలిస్టు కర్రె రాములుకు,ఇటీవల మరణించిన తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన జిట్టా బాలకృష్ణరెడ్డి కి, వర్ష బీభత్సంలో ప్రాణాలు కోల్పోయిన వారికి,బూటకపు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా జోహార్లర్పించారు.ఈ సందర్భంగా జనార్ధన్, ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశంలు మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొల్పడం,అట్టడుగున పడి వున్న ప్రజా సమస్యలను వెలికితీయడం, సమస్యలను పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకపోవటం జర్నలిస్టుల విధి అని, ఆ కర్తవ్యాన్ని మరింత ధృఢంగా ముందుకు తీసుకు పోవాలని కోరారు. ఆలేరు ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఎన్నో విధాలుగా ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని చేస్తున్నప్పటికీ, ప్రజలు పోరాడుతున్నప్పటికీ మొన్నటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు.ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఉత్తిత్తి మాటలతో కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా ఆలేరు ను రెవెన్యూ డివిజన్‌గా యుద్ధ ప్రాతిపదికన ప్రకటించాలని,ఆలేరు రైల్వే గేట్ అండర్ పాస్ బిడ్జి నిర్మాణం ఆగిపోయిందని, బిడ్జిని వెంటనే నిర్మించి ప్రజల అసౌకర్యాన్ని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కో కన్వీనర్లు మొరిగాడి చంద్రశేఖర్, చెక్క వెంకటేష్,పద్మ సుదర్శన్, కెమిడి ఉప్పలయ్య కామిటికారి అశోక్ , పద్మ సుదర్శన్, ఎస్ సత్యం, వంగపల్లి అంజయ్య స్వామి, బాంబే రవి,ఎండిసలీం, తుంగకుమార్, సొడబోయినకనకయ్య,ఇక్కిరి సహదేవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రింట్‌ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డే సందర్భంగా ఆలేరు అఖిలపక్ష సాధన కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కుర్షిద్‌పాషా,అరె భానుప్రసాద్, ఎర్రజాన్సన్, గుండు మహేందర్, మాధవరెడ్డి, యేలగల కుమారస్వామి,కుళ్ళ సిద్దులు, సీస సాయిరాం, గుండు మధుసూదన్, కొంతం సిద్దార్థగౌడ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

గణనాధునికి ఘనంగా పూజలు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్గొండ దేవరకొండ రోడ్డు కనకదుర్గ కాలనీలో ఆదివారం కాలనీవాసులు గణనాధునికి ఘనంగా పూజలు చేశారు. మహిళలు కోలాటం వేయగా చిన్నారులు సంస్కృతిక నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, డి. కోటయ్య శ్రీను, ప్రతాపరెడ్డి, పందుల రవి, ఎం. రవీందర్ రెడ్డి, జి. లింగారెడ్డి, మల్లారెడ్డి, వెంకట్రెడ్డి, చేనగోని నగేష్, ముచ్చర్ల శ్రీనివాస్, జి. సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యా కమిషన్ చైర్మెన్‌గా ఆకునూరి మురళీ ఎన్నిక పట్ల హర్షం

- బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథనాయక్

నవతెలంగాణ-మిర్యాలగూడ


విద్యావ్యవస్థపై పూర్తి అవగాహన వుండడంతో పాటు విద్యావ్యవస్థను బలోపేతం చేయాలనే కృతనిశ్చయంతో వున్న రిటైర్డు ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీని విద్యాకమిషన్ చైర్మెన్‌గా ఎన్నిక కావడం పట్ల బంజారా ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథనాయక్ తెలిపారు.ఆదివారం మిర్యాలగూడలో జరిగిన బంజారా ఉద్యోగుల సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు.గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖకు ముఖ్య సలహాదారుగా పనిచేసి ఆ రాష్ట్రంలో విద్యావ్యవస్థను పూర్తిగా బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి కృషిచేశారని చెప్పారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మెన్ మురళీ ఎన్నిక కావడంతో ప్రభుత్వ విద్యాసంస్థలలో వున్న సమస్యలు పరిష్కారమై ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. తద్వారా బడులు పూర్వంవలె విద్యార్థులతో కళకళలాడ నున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు. విద్యావ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మురళీని విద్యా కమిషన్‌చైర్మెన్‌గా ఎన్నిక చేశారనిఎంపిక చేశారని గుర్తు చేశారు.ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు చెప్పారు.సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు రమేష్,శ్రీను,లాలు,లక్ష్మణ్,సీతారాం, మక్ల,బాలాజీ,సుశీల,దేవి,శ్రీదేవి పాల్గొన్నారు.



24 గేట్ల ద్వారా కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

కృష్ణానది పరివాహక ప్రాంతాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువనున్న జలాశయాలు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాజెక్టులన్ని నిండి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం క్రస్ట్ గేట్లు, కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 2,60,488 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ రిజర్వా యర్‌కు వచ్చి చేరుతుండటంతో ఎన్ఎస్పీ అధికారులు 20 క్రస్ట్ గేట్లను 5 అడుగులు 4 క్రస్ట్‌గేట్లను 10అడుగులు మొత్తం 24 క్రస్ట్‌గేట్లను ఎత్తి 2,18,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుండి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 24 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 588.70 అడుగులవద్ద నీరు నిల్వవుంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 308.1702 టీఎంసీల నీరు నిల్వ ఉంది.జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,070 క్యూసెక్కుల నీటిని,కుడి కాలువ ద్వారా 8604 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వద్వారా 2114 క్యూసెక్కుల నీటిని,ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని,లోలేవల్ కెనాల్ ద్వారా 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుండి మొత్తం 2,60,488 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



దివీస్ పరిశ్రమ బారి నుండి రైతులను ఆదుకోవాలని..

నేడు కలెక్టరేట్ ముందు ధర్నా

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ పరిశ్రమ నుండి వెలువడే రసాయనాల కాలుష్యాన్ని అరికట్టాలని, నష్టపోతున్న ప్రజలు, రైతులను ఆదుకోవాలని నేడు కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండలకార్యదర్శి గంగదేవి సైదులు కోరారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దివీస్ పరిశ్రమ కాలుష్యం వల్ల చుట్టుపక్కల గ్రామాలు భూగర్భ కాలుష్యంతో నీరు కలుషితమై ప్రజలు, మూగజీవాలకు తాగునీరు కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలకు గర్భకోశ, క్యాన్సర్ వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. ప్రజల ప్రాణాలతో దివీస్ పరిశ్రమ చెలగాటమాడుతుందన్నారు. మూగ జీవాలకు చర్మవ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. వ్యవసాయ భూములు ఎడారిగా మారిపోతున్నాయన్నారు. కాలుష్యాన్ని అరికట్టడంలో పీసీబీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.పరిశ్రమల యాజమాన్యాలతో లాలూచీ పడుతున్నారని పేర్కొన్నారు. దివీస్ పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాల్లో నష్టపోతున్న రైతులను సీపీఐ(ఎం) బృందం వెళ్లి ఇటీవల వారి సమస్యలు అధ్యయనం చేసిందని తెలిపారు. దివీస్ పరిశ్రమ వల్ల నష్టపోతున్న రైతులు, ప్రజల కోసం ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



ప్రపంచ మనుగడ శాస్త్రీయత పైనే ఆధారపడి ఉంది

- జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ప్రపంచ మనుగడ శాస్త్రీయ పరిశోధన పైనే ఆధారపడి ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు అన్నారు.ఆదివారం నల్గొండ పట్టణంలోని ఆల్ఫా జూనియర్ కళాశాలలో నిర్వహించిన జేవీవీ నల్గొండ జిల్లాలో ఐదో మహాసభల సందర్భంగా ఏర్పాటైన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్రధానంగా విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుకోవాలంటే పరిశోధనపై దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికీ మూఢవిశ్వాసాలు అక్కడక్కడ కనిపిస్తూనే ఉన్నాయని, వీటిని విశ్వసించే వారిలో వారు కూడా ఉండడం దురదృష్టకరమన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికీ భారతదేశం లేదని అందుకోసం యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రశ్నావళికి సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న మూఢవిశ్వాసాలపై జన విజ్ఞాన వేదిక 36 ఏండ్లుగా పోరాటం సాగిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి,యూటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎడ్ల సైదులు,పెరుమాళ్ల వెంకటేశం,జేవీవీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి అమరయ్య రాష్ట్ర కమిటీ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర నాయకుడు చేపూరి సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక...

జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా మిర్యాలగూడకు చెందిన గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు.ప్రధాన కార్యదర్శిగా నల్గొండకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రాఫెల్, కోశాధికారిగా మిర్యాలగూడకు చెందిన ఉస్మాన్ అలీ ఎన్నికైనట్లు రాష్ట్ర కోశాధికారి వరప్రసాద్ ప్రకటించారు. మరో 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

బేగంపేట మాజీ ఉపసర్పంచ్ మృతి

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం బేగంపేట మాజీ ఉప సర్పంచ్ కాసుల వీరమల్లు మృతి చెందారు. గ్రామస్థాయిలో రాజకీయ నాయకుడిగా ఉంటూ మొదటి నుంచి చివరి వరకు కాంగ్రెస్‌లోనే ఉంటూ, గ్రామ ఉపసర్పంచ్ గాను పనిచేసి, గ్రామస్తుల తోటి పార్టీలకతీతంగా అందరితో కలిసిపోయి కలిసిమెలిసి ఉండిన కాసుల వీరమల్లు ఆదర్శనీయుడని పలువురు కొనియాడారు. ఆత్మకుశాంతి చేకూర్చాలని కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేస్తూ మాజీ ఎంపీటీసీ సభ్యులు భోగ హరినాథ్ పరామర్శించారు.

స్వాతి నక్షత్రం సందర్భంగా పూర్ణగిరిలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో స్వాతి నక్షత్రం సందర్భంగా స్వయంభు శ్రీ సుదర్శన పూర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఉపాసనకులు బత్తిని రాములుగౌడ్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అష్టోత్తరం, అలంకార సేవలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి పవన్‌కుమార్‌శర్మ, కుమార్‌గౌడ్, పరమేశ్వర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, గుండాల సత్యనారాయణ, ఇంద్రారెడ్డి, బత్తిని వెంకటేశ్ పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ ఒకటో వార్డు లో వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఆ వార్డు కౌన్సిలర్ మంగ్తానాయక్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వారి వెంట వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన పల్లెటి మహేష్ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతిచెందాడు.అతని భార్య మూడేండ్ల కింద చనిపోయింది.భార్యాభర్తలు ఇద్దరు చనిపోవడంత వారి ఇద్దరు కుమారులు,ఒక కూతురు అనాథలుగా మారారు. వారి పరిస్థితిని చూసిన గ్రామానికి చెందిన యువకులు అందరూ కలిసి ఆదివారం ఆ పిల్లలకు రూ.15100 ఆర్థికసహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో పెరికెటి రమేష్, రజబోయిన హనుమంతు,దండిగ లింగయ్య,పెరికెటి జగన్,ఎల్ల గిరి, వడ్లకొండ ప్రవీణ్,చేపూరి శ్రీను, పగిల్ల నగేష్,వగ్గు రామకృష్ణ పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన మాజీ జెడ్పీటీసీ

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన ఊరు పాక కవిత-శంకర్‌ల కూతురు తేజశ్రీ, కుమారుడు సాన్విత్‌తేజ్‌ల నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమానికి నాంపల్లి మాజీ జెడ్పీటీసీ ఏలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గెలవాల్‌రెడ్డి,నరేందర్‌రెడ్డి, వట్టికోటిసుధాకర్, వట్టికోటిసత్తయ్య, వట్టికోటిశేఖర్, వట్టికోటియాదయ్య, ఊరుపాక వెంకటయ్య, శాంతికుమార్, ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నకిరేకల్

పట్టణంలోని ఐదో వార్డు చీమలగడ్డ ప్రాంతానికి చెందిన ఒంటెపాక యాదగిరి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర మహిళ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్, సీనియర్ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి తదితరులున్నారు.

పంట నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధం

నవతెలంగాణ-మాడ్గులపల్లి

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించి ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు సిద్ధంగా ఉందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి అన్నారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను గుర్తించాలని ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయ అధికారులను ఆదేశించిందన్నారు.మండల పరిధిలోని పంట నష్టపోయిన రైతులు సెప్టెంబర్ 12 లోగా తమ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియజేసి క్షేత్రస్థాయి పరిశీలన చేయించుకోవాలన్నారు. పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తలు,మాజీ ప్రజాప్రతినిధులు అండగా నిలిచి వ్యవసాయశాఖ అధికారులకు, రైతులకు అనుసంధానకర్తలుగా ఉండి అర్హులైన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించేలా సహకరించాలని కోరారు.

శాస్త్రోక్తంగా సిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని నాయినవానికుంట గ్రామంలో శనివారం విగ్రహదాతలు గ్రామానికి చెందిన వెటర్నరీ డాక్టర్ మూల విక్రమ్‌రెడ్డి, పూజిత దంపతులు, వారి తల్లిదండ్రులు మూల శేఖర్‌రెడ్డి, నారాయణమ్మ అందించిన విగ్రహానికి కొట్టె కోటేష్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గణపతి నామస్మరణ మధ్య ఘనంగా చేపట్టారు.గ్రామస్తుల ఆధ్వర్యంలో పురోహితులు శేఖర్‌బాబు సహాయకుల పర్యవేక్షణలో విశేషపూజలు చేసి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ చేశారు.ఈ కార్యక్రమంలో నడ్డి నాగరాజు, లవకుశ, కత్తి జనార్దన్‌రెడ్డి, ఆవుల ముత్యాల్‌రెడ్డి, కూన్‌రెడ్డి విజయందర్ రెడ్డి,చెవుల సైదయ్య,తదితరులు పాల్గొన్నారు.

నాడు నారికేళపల్లి.. నేడు నార్కట్‌పల్లి

- ఆనాటి సత్రం.. నేడు సత్రం బడి
- ఔరంగజేబు కాలంనాటి ప్రశస్తి సరాయి మిరాళం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నార్కట్‌పల్లి పట్టణానికి పూర్వం ఘనచరిత్ర ఉన్నట్టు తెలుస్తుంది. చరిత్రలో గొప్పగా చెప్పుకుంటున్న కాకతీయ కాలంనాటి 13వ శతాబ్దానికి చెందిన రాణి రుద్రమదేవి, ఔరంగజేబు కాలం నాటి కట్టడాలు, అతి పురాతన సమాధులు డాల్మెన్ సమాధులుగా చరిత్ర చరిత్రలో గొప్పగా నిలిచిన నార్కట్ పల్లికి ఆ పేరు ఏలా వచ్చిందంటే.. పూర్వం నార్కట్ పల్లి



ప్రజల ప్రధానవృత్తి వ్యవసాయం. పాడిపంటలతో పశుసంపదతో వర్ధిల్లినట్టిది. ఇక్కడ విరివిగా నారికేళ తోటలు (కొబ్బరితోటలు) ఉండేవట. అందుకే ఈ గ్రామమునకు నారికేళపల్లి అని అనేవారు. కాలక్రమేణ నారికేళపల్లి "నార్కట్ పల్లి"గా రూపాంతరం చెందింది. ఈ ప్రాంతం కాకతీయుల కాలంలో బాగా అభివృద్ధి చెందినట్టిది. 13వ శతాబ్దమునకు చెందిన కాకతీయ చక్రవర్తినియైన రాణిరుద్రమదేవి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. మూసీనదిమీద వరుస కత్వలు 33 నిర్మించినది.(కత్వలు అనగా నీటిని నిలువచేసే చెరువులు). ఈ 33 కత్వలను ఒకదాని తరువాత ఇంకొకటి నింపడం వలన వ్యవసాయాభివృద్ధి జరిగింది. నల్లగొండలోని పానగల్లు చెరువుకూడా అదే



క్రమంలో నిర్మించిన చెరువే. రహదారులవెంట ప్రజల సేదతీరడానికి అనేక సత్రాల నిర్మాణము రాణిరుద్రమ కాలంలో చేపట్టారు.

ఆ నాటి సత్రం.. నేడు సత్రం బడి..

రహదారుల వెంట ప్రజలు సేద తీరడానికి రాణి రుద్రమ కాలంలో సత్రాలు ఏర్పాటు చేసేవారు. ఆ క్రమంలో నార్కట్ పల్లి పట్టణంలో ఏర్పాటుచేసిన సత్రం. నేడు విద్య వ్యాప్తికై సత్రం బడిగా వర్ధిల్లుతుంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 103 మంది విద్యార్థులు ఒకటి నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు.

డాల్మెన్. సమాధులు..

నార్కట్ పల్లి చేరువలో అతిపురాతన కాలమునకు చెందిన సమాధులు ఉన్నవి. ఇవి వందల సంఖ్యలో ఉన్నవి. ఇవి కొత్తరాతియుగపు మానవ సమాజమునకు సంబంధించినవి. ఈ సమాధులను "డాల్మెన్" సమాధులు అంటారు. ఔరంగజేబుకాలంనాటి .. ప్రశస్తి సరాయి మిరాళం.. ఔరంగజేబుకాలంనాటి కాలంలో ఈ.గ్రామమునందు "సరాయి మిరాళం" నిర్మించబడియున్నది. ఇక్కడ అతి ప్రాచీనమైన చారిత్రాత్మకమైన మజీద్ గలదు. సరాయిమిరాళం అనగా సరాయి అనగా విశ్రాంతిగది, మిరాళం అనగా ప్రముఖులు అనగా ప్రముఖులు బసచేసే ప్రాంతం అని అర్థం. ఈ మసీదులో 42 గదులతో కూడిన రెండున్నర ఎకరాల స్థలంలో మసీదు నిర్మించబడింది. ఇవి రెండునూ ఔరంగజేబు కాలంనాటివని ప్రశస్తి. ఔరంగజేబు సైన్యము దక్కన్ ప్రాంతాన్ని సందర్శిస్తూ ఈ ప్రాంతం గుండా ప్రయాణిస్తూ తాము బసచేయడానికి సరాయిమిరాళంను నమాజు చేయడానికి మజీదు నిర్మాణం చేయించారనిచారిత్రకాధారాలున్నాయి.

దేశ రక్షణకు యువతను తయారు చేయడమే లక్ష్యం

నవతెలంగాణ-సూర్యాపేట

దేశ రక్షణకు నేటి తరం యువతను తయారు చేయడమే లక్ష్యంగా శ్రీ సాయి వైష్ణవి సైనిక్ అకాడమి పని చేస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ గొట్టిపర్తి శ్రీకాంత్, అకాడమిక్ డైరెక్టర్ గుడిపూడి కృష్ణలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో శ్రీ సాయి వైష్ణవి సైనిక్ అకాడమిని వారి తల్లులు గొట్టిపర్తి భిక్షమమ్మ, గుడిపుడి వెంకమ్మల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించిన అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులను క్రమశిక్షణతో ఉండేలా, పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చేలా శిక్షణ ఇస్తామన్నారు. తమ అకాడమిలో సైనిక్ స్కూల్‌తో పాటు రాష్ట్రీయ మిలటరీ స్కూల్, నవోదయ స్కూల్ లలో ఎంట్రన్స్ పరీక్షలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ పరీక్షలకు జనవరి 2025 వరకు 12, 15 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. తమ అకాడమిలో వారం రోజుల పాటు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు డెమో తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి క్రమశిక్షణతతో ముందుకు సాగేలా తీర్చిదిద్దుతామన్నారు. అకాడమి ప్రారంభోత్సవంలో జబర్దస్త్ టీం సభ్యులు సందడి చేశారు. వారు చేసిన స్కిట్ లు విద్యార్థులు, సభికులను అలరించాయి. ఈ కార్యక్రమంలో అనంతుల వెంకన్న గౌడ్, జబర్దస్త్ టీం సభ్యులు వెంకి మంకి, చిత్రం శ్రీను, వినోదిని, హరిత, చిట్టిబాబు, నాగతేజ, నాగిరెడ్డి, లండన్ డ్రాయర్, పిట్టల శ్రీకాంత్, కరుణకర్, వంశీ, సాయి చరణ, విద్యార్థులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు నిబంధనలను పాటించాలి: ఎస్ఐ

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని 29 గ్రామపంచాయతీలో 55 గ్రామాల్లో 164 విగ్రహాలు ఏర్పాటు చేశారు. 128 విగ్రహాలకు అనుమతి పొందినట్టు. స్థానిక ఎస్సై క్రాంతి కుమార్ పేర్కొన్నారు. గణనాథుని విగ్రహాలు ఏర్పాటులో సుప్రీంకోర్టు నిబంధనలను కచ్చితంగా ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా గణేష్ ఉత్సవ కమిటీ పాల్పడితే ప్రత్యేకంగా ఆట్టి విగ్రహ కమిటీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే లకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేవని భక్తమండలి సభ్యులు పోలీసు వారి కి సహకరించాలని కోరారు.

ఘనంగా వినాయక నవరాత్రి మహోత్సవాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం కొండపై కొలువు దీరిన శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల వరసిద్ధి వినాయక గుడి వద్ద చత్రపతి శివాజీ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 17వ వార్షికోత్సవ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలను వేద పండితులు రాధాకృష్ణ అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం మట్టితో చేసిన గణపయ్యకు నిర్వహించిన తొలి పూజ కార్యక్రమంలోలక్ష్మణ్, పాడిశెట్టి వీరయ్య, చదుర్ల సాగర్, చిమట రుక్మరాజు, చిట్యాల సైదులు, చిరుమామిళ్ల కృష్ణ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని గజముఖ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నాగటి సుధీర్ బాబు, రవి,సతీష్, భరత్, సైదులు, రహీమ్, సాయి, అరవింద్ పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- ఎఐజీడీఎస్యు రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజ్

నవతెలంగాణ-సూర్యాపేట

గ్రామీణ తపాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నిరంతరం ఉద్యమిస్తుందని ఎఐజీడీఎస్యు రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజ్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ట్రిబుల్ ఆర్ ఫంక్షన్హాల్లో ఏర్పాటు చేసిన ఎఐజీడీఎస్యు డివిజన్ 5వ ద్వైవార్షిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎఐజీడీఎస్యు పోరాడుతుందన్నారు. ఎఐజీడీఎస్యు పోరాటంతో గతంలో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని పరిష్కారం కానీ సమస్యలను కూడా పరిష్కరించు కునేందుకు ఐక్యంగా ఉద్యమిద్దామన్నారు. కేంద్ర ప్రభుత్వం 2026లో ప్రవేశపెట్టే 8వ వేతన సంఘంలో గ్రామీణ తపాల ఉద్యోగులను చేర్చాలన్నారు. తపాల ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యంతో పాటు హెల్త్ కార్డులు అందించాలని కోరారు. ఎన్నో యేళ్ళుగా ఉద్యోగం చేస్తున్న తపాల ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధన కోసం ఎఐజీడీఎస్యు ఆధ్వర్యంలో గ్రామీణ తపాల ఉద్యోగులంతా ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన అవసరముందన్నారు. అనంతరం ఎఐజీడీఎస్యు డివిజన్ కమిటీ అధ్యక్షులు పుల్లయ్య, కార్యదర్శిగా నాగరాజులతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎఐజీడీఎస్యు డివిజన్ అధ్యక్షులు ఎం.కరుణాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పోస్టల్ సూపరింటెండెంట్ వడ్డమూడి వెంకటేశ్వర్లు, ఎ ఐజీడీఎస్యు ఉపాధ్యక్షులు చలిగంటి పుల్లయ్య, మిధున్, శ్రవణ్ కుమార్, దివ్య కరుణాకర్, రామనర్సయ్య, బిక్షం పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

నవతెలంగాణ-చిట్యాల

మండల పరిధిలోని జియో పెట్రోల్ బంక్ సమీపంలో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై టాటా బోల్ట్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద వివరాలు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం నార్కట్పల్లి గ్రామానికి చెందిన మైనంపాటి శంకర్ రెడ్డి అతని తండ్రి మీనా రెడ్డిలు కలిసి టాటా బోల్ట్ కార్లో నార్కట్‌పల్లి నుండి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో జియో హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంకు చేరుకోగానే ఇంజన్ నుండి అకస్మాత్తుగా పొగలు రావడంతో వెంటనే వారు గమనించి కారు నుండి దిగి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పడం జరిగిందని వారు తెలిపారు. ఈ ప్రమాదంలో టాటా బోటు కారు పూర్తిగా దగ్ధమైందని పేర్కొన్నారు ఫిర్యాదుదారుడు మైనంపాటి శంకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్సై ఎన్ ధర్మ తెలిపారు.